ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
ఆదివారం 3 ఆగస్టు 2025


ఎరువుల సరఫరా సక్రమంగా చేపట్టాలి

8

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం మెరుగుపడాలి
- కేడీపీ సమావేశంలో పంచాయతీ పాలనాధికారి కేవీ త్రిలోక చంద్ర



దళ్..ధమాల్..!



- ప్రజ్వల్‌కు యావజ్జీవ శిక్ష.. ఖంగుతిన్న జేడీఎస్ నాయకులు
- కంటతడి పెట్టిన దేవెగౌడ ● కొంపముంచిన పెన్‌డ్రైవ్‌లు
- కుటుంబ సభ్యుల్లో తీవ్ర విషాదం ● మెరిట్ స్టూడెంట్‌ను.. రాజకీయంగా ఎదగడమే తప్పు..
- కోర్టులో ప్రజ్వల్ కంటతడి ● శిక్ష సమాజానికి సందేశం కావాలి: ఎస్‌పీపీ

బెంగళూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పనిమనిషిపై అత్యాచారానికి పాల్పడిన కేసులో జేడీఎస్ పార్టీ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ (34) కు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం శనివారం తీర్పు ప్రకటించింది. ఈ పరిణామంతో జేడీఎస్ పార్టీకి తీవ్ర పరాభవం కలిగించింది. పార్టీ నేతలు తీవ్ర వేదనకు గురయ్యారు. ఇన్నాళ్లు ఏదో చిన్న శిక్షతో బయటకు వస్తాడనుకున్న ప్రజ్వల్‌కు ఏకంగా జీవితఖైదు విధించడంతో పార్టీ నాయకులకు దిక్కుతోచని స్థితి నెలకొంది. ప్రత్యేకించి మాజీ ప్రధాని దేవేగౌడ కుటుంబానికి కోలుకోలేని దెబ్బతీసింది.

ఎంపీ ఎన్నికల నాటి నుంచే మొదలైన కష్టాలు

2024 ఏప్రిల్‌లో లోక్‌సభ ఎన్నికలు కొనసాగుతున్న ఉత్కంఠ తరుణంలో అప్పటి హాసన్ జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించిన అత్యాచార వీడియోలు, ఫొటోలు వైరల్ అయ్యాయి. సరిగా పోలింగ్‌కు రెండు రోజుల ముందు హాసన్ నగరవ్యాప్తంగా వేలాది పెన్‌డ్రైవ్‌లు చల్లినట్టు తేలింది. పోలింగ్ రోజు రాత్రి ప్రజ్వల్ రేవణ్ణ యూరప్ దేశాలకు వెళ్లారు.

ప్రజ్వల్ రేవణ్ణ 2019 లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారి హాసన్ ఎంపీ స్థానానికి జేడీఎస్ పార్టీ తరపున పోటీ చేశారు. ఆ వెంటనే కొవిడ్ రావడంతోపాటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా చిన్నాన్న కుమారస్వామి కొనసాగారు. తండ్రి రేవణ్ణ అప్పటి సంకీర్ణ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించారు. ఇదే కాలంలోనే ప్రజ్వల్ 48ఏళ్ల పనిమనిషితోపాటు పలువురిపై అత్యాచారం, లైంగిక వేధింపులకు పాల్పడినట్లు వీడియోలు బహిర్గతమయ్యాయి. పనిమనిషిని హొళెనరసీపురలోని ఫాంహౌస్‌తోపాటు బెంగళూరులోని బసవనగుడి ప్రాంతం తండ్రి రేవణ్ణ ఇంట్లోనూ అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె, ప్రజ్వల్ వేధింపులను తట్టుకోలేక పోలీసులను ఆశ్రయించారు. తొలుత కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రజ్వల్‌కోసం గాలింపు జరపతలపెట్టారు. అతను విదేశాల్లో ఉండడంతో ఆచూకీ కోసం ప్రయత్నించారు. ఇలా సాగుతుండగానే బాధిత మహిళను ప్రజ్వల్ తండ్రి రేవణ్ణతోపాటు సమీప బంధువుతో కలసి కిడ్నాప్‌నకు పాల్పడ్డారు. ఎక్కువ మందిపై బలాత్కారం చేసినట్లు వీడియోలు ఉండడంతో తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన సిట్ కిడ్నాప్ అయిన బాధితురాలిని మైసూరు సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో గుర్తించి రక్షించారు. ఈ కేసులో తండ్రి రేవణ్ణను అరెస్టు చేశారు. ఆ తర్వాత తల్లి భవానికి నోటీసులు ఇచ్చినా విచారణకు హాజరు కాకుండా అజ్ఞాతంలోకి వెళ్లి కొన్నిరోజుల తర్వాత ముందస్తు బెయిల్ పొందారు. 2024 మే 31న యూరప్ నుంచి బెంగళూరుకు ప్రజ్వల్ వెనుతిరిగి రాగా ఎయిర్‌పోర్ట్‌లోనే సిట్ అదుపులోకి తీసుకుంది. ఈకేసును సమగ్రంగా విచారించిన సిట్ 2024 సెప్టెంబరు 8న 120 మందికిపైగా సాక్ష్యాలతోపాటు 2వేల పేజీలతో చార్జ్‌షీట్ దాఖలు చేసింది. దర్యాప్తులో భాగంగా ప్రజ్వల్‌కు మగతనం పరీక్షలు జరిపారు. రెండుసార్లకుపైగా పరీక్షలు జరపడంతో విచారణకు కోర్టు ముందుకు వచ్చిన ప్రజ్వల్ తరచూ ఒకే విధమైన పరీక్షలు జరుపుతున్నారంటూ అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. మరోవైపు కేసునుంచి ఉపశమనం కల్పించాలని మరోవైపు బెయిల్‌కోసం ప్రజాప్రతినిధుల కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టు దాకా ప్రయత్నాలు చేశారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో బెయిల్ పిటిషన్‌లను రద్దు చేశారు.



14 నెలలు జైలులో ఉన్నా...

ప్రజ్వల్ రేవణ్ణ గత ఏడాది చివరన జర్మనీ నుంచి వెనుదిరిగి రాగా బాడీ వారెంట్‌పై అదుపులోకి తీసుకున్నారు. ఇలా 14 నెలలుగా ప్రజ్వల్ పరప్పన అగ్రహార జైలులోనే ఉన్నారు. బాడీ వారెంట్‌పై ఉండడంతో ప్రస్తుతం యావజ్జీవ కారాగారశిక్షలో భాగంగా 14ఏళ్ల జైలు శిక్షకు 14నెలలు వర్తించదు. దీంతో పూర్తి స్థాయిలో జైలుశిక్షను అనుభవించాల్సి ఉంటుంది. ప్రజ్వల్ రేవణ్ణపై నాలుగు కేసులు నమోదు కాగా తొలికేసులో తీర్పు వెల్లడైంది. మరో మూడు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతోనే..

సిట్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఎస్‌పీపీ) అశోక్‌నాయక్, బీఎన్ జగదీశ్‌లు వాదించారు. శిక్ష ఖరారు చేసేందుకు ముందు కోర్టులో వాదనలు వినిపిస్తూ సమాజానికి సందేశం ఇచ్చేలా శిక్ష ఉండాలని అభిప్రాయపడ్డారు. పలుకుబడి, అధికారం ఉందని ఇష్టారాజ్యంగా మహిళలపట్ల అనుచితంగా వ్యవహరించిన ఈ వివాదంలో తగిన శిక్ష ఉండాలని వాదించారు. కాగా ప్రజ్వల్ తరపున నళినా మాయేగౌడ వాదనలు వినిపించారు.

ఏయే సెక్షన్‌లు అంటే..

ఐపీసీ 376 (2) (కే) నిబంధనల కింద యావజ్జీవ శిక్షతోపాటు రూ.5లక్షల జరిమానా విధించారు. 376 (2)(ఎన్)కు అనుగుణంగా పదే పదే అత్యాచారంనకు యావజ్జీవ జైలుశిక్ష, రూ.5లక్షల జరిమానా విధించారు. 354 (ఏ) కింద మూడేళ్ల జైలుశిక్ష, 25వేలు జరిమానా. 354(బీ) కింద ఏడేళ్ల జైలు, రూ.50వేల జరిమానా, 354 (సీ) మూడేళ్ల జైలు, 25వేల జరిమానా, 506 సెక్షన్‌కింద రెండేళ్ల జైలు 10వేల జరిమానా, 201 సెక్షన్‌కింద మూడేళ్ల జైలు, 25వేల జరిమానా, ఐటీ చట్టం 66 (ఇ) సెక్షన్‌కింద మూడేళ్ల జైలు, రూ.25వేల జరిమానా విధించారు. అన్ని సెక్షన్‌ల ప్రకారం రూ.11.60 లక్షల జరిమానా విధించినట్లయ్యింది. ఇందులో 11.25 లక్షలు బాధితురాలికి పరిహారంగా ఇవ్వాలని న్యాయమూర్తి సూచించారు.

కన్నీటితో విన్నపం..

ఈ సందర్భంగా ప్రజ్వల్ ఏడుస్తూ ఎంపీగా పనిచేశాననీ, అప్పుడు ఎవరూ తనపై అత్యాచార ఆరోపణలు చేయలేదని, ఎన్నికల వేళ ఆరోపణలు చేశారన్నారు. ఎంపీగా ఉత్తమంగా పనిచేశానని, మెకానికల్ ఇంజనీరింగ్‌లో మెరిట్ స్టూడెంట్ అని రాజకీయాల్లో వేగవంతంగా ఎదగడమే తాను చేసిన తప్పు అంటూ రోదించారు. తన తల్లిదండ్రులను ఆరు నెలలుగా చూడలేదన్నారు. సాయంత్రం 4 గంటల తర్వాత న్యాయమూర్తి సంతోష్ గజాననభట్ తీర్పు ప్రకటించారు.2025 మే 2నుంచి ప్రజాప్రతినిధుల కోర్టు నిరంతరంగా విచారణ ప్రారంభించింది. జులై 18నాటికి విచారణ పూర్తయ్యాయి. ఆగస్టు 1న శుక్రవారం ప్రజాప్రతినిధుల న్యాయస్థానం అత్యాచారం కేసులో ప్రజ్వల్‌ను దోషిగా ప్రకటించింది. కోర్టు హాల్‌లోనే ఉన్న నిందితుడు ప్రజ్వల్ ఒక్కసారిగా కంటతడిపెట్టి రోదించాడు. శనివారం న్యాయమూర్తి సంతోష్ గజాననభట్ చివరగా ప్రజ్వల్‌కు చెప్పుకోవాల్సింది ఏమైనా ఉందా..? అంటూ ప్రశ్నించారు.

మనవడికి శిక్ష.. తాత కంటతడి

మనవడు ప్రజ్వల్ రేవణ్ణకు యావజ్జీవ కారాగార శిక్ష విధించడంతో తాత, మాజీ ప్రధాని దేవెగౌడ కంటతడి పెట్టినట్లు తెలుస్తోంది. శనివారం దేవెగౌడ కుటుంబీకులంతా ప్రజ్వల్‌కు ఎటువంటి శిక్ష పడుతుందోనని ఎదురుచూశారు. యావజ్జీవ కారాగార శిక్షగా ప్రకటించగానే కుటుంబ సభ్యుల్లో మౌనం ఆవరించింది. పద్మనాభనగర్‌లోని దేవెగౌడ నివాసం వద్ద ఎవరూ కనిపించలేదు. మరోవైపు ప్రజ్వల్ తండ్రి రేవణ్ణ నివసిస్తున్న బసవనగుడిలోని నివాసం వద్ద ఇంటి తలుపులు వేశారు. జేడీఎస్ పార్టీకి చెందిన నాయకులు ఎవరూ అందుబాటులో లేకుండా పోయారు. రాష్ట్ర రాజకీయాల్లో దేవెగౌడ ఐదు దశాబ్దాలకుపైగా కొనసాగారు. పంచాయతీ నుంచి ప్రధానమంత్రి దాకా పదవులు అలంకరించారు. రాజకీయ వారసులుగా ఓ కుమారుడు కుమారస్వామి ముఖ్యమంత్రిగా రెండుసార్లు కొనసాగి ప్రస్తుతం కేంద్రమంత్రిగా ఉన్నాడు. మరో కుమారుడు రేవణ్ణ వరుసగా ఆరేడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా వ్యవహరించారు. రేవణ్ణ మరో కుమారుడు సూరజ్ ఎమ్మెల్సీగా ఉన్నారు. దేవెగౌడ కుటుంబంలోని ఏడెనిమిది మంది రాజకీయాల్లో కీలకపదవుల్లో కొనసాగినా కేసులలో ఎక్కడా శిక్షకు గురి కాలేదు. రాజకీయ కక్షలతో కేసులు ఉన్నా అవి ఎక్కడా నిలబడలేదు.

తొలిసారి ఎంపీ కావడమూ వివాదమే

హాసన్ ఎంపీగా జేడీఎస్ నుంచి తొలిసారి 2019లో గెలుపొందిన ప్రజ్వల్ పలు వివాదాలు ఎదుర్కొన్నారు. అతడికి సంబంధించి ఆస్తులు అఫిడవిట్‌లో నమోదు చేయలేదని అప్పటి బీజేపీ ప్రత్యర్థి ఏ మంజు కోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ తర్వాత ప్రజ్వల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఇలా ఎంపీ పదవిని ప్రజ్వల్ కోల్పోయాడు సుప్రీంకోర్టులో స్టే లభించడంతో తిరిగి లోక్‌సభ సమావేశాల్లో పాల్గొన్నారు.

విషాదం

ప్రజ్వల్‌కు యావజ్జీవ శిక్ష ఖరారుతో దేవెగౌడ కుటుంబంలో విషాదం నెలకొంది. రాష్ట్ర రాజకీయాల్లో ఆయన కుటుంబానికి ఎంతో పేరుంది. ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, ప్రధానమంత్రిగా వ్యవహరించిన ఆయన ప్రస్తుతం 92ఏళ్ల వయసులోనూ రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. మరో కుమారుడు కుమారస్వామి ప్రస్తుతం కేంద్రమంత్రిగా ఉన్నారు. రెండో కుమారుడైన రేవణ్ణ ఎమ్మెల్యేగా ఉండగా మనవడికి శిక్ష ఖరారుతో ఈ వయస్సులో వేదన తప్పడం లేదంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

పాహిమాం.. పవన పుత్రా

- వెన్న అలంకరణలో దర్శనమిచ్చిన హనుమంతుడు
- స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు



హనుమంతుడు వెన్న అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చాడు. బళ్లారి వెంకటేశ్వరనగర్‌లో వెలసిన అభయ వరదాంజనేయస్వామిని శ్రావణమాసం రెండవ శనివారం సందర్భంగా వెన్నతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి అభిషేకం అర్చన ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ధనుంజయ తెలిపారు.

- బళ్లారి రూరల్, ఆంధ్రజ్యోతి

చిత్రావతి డ్యాంకు ఎస్‌ఎం కృష్ణ పేరుపై అభ్యంతరం


వినతిపత్రం అందజేస్తున్న పోరాట సమితి సభ్యులు

బాగేపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని పరగోడు వద్ద చిత్రావతి నదిపై నిర్మించిన డ్యాంకు మాజీ సీఎం ఎస్‌ఎం కృష్ణ పేరు పెట్టేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేశారు. బాగేపల్లి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద చిత్రావతి పోరాట సమితి నేతృత్వంలో శనివారం నిరసన చేపట్టారు. పురసభ కార్యాలయం ప్రకటనపై వివిధ పార్టీల నేతలు, రైతులు, దళిత, వ్యవసాయ కూలి కార్మిక సంఘాలు, మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీరామరెడ్డి అభిమానులు వందలాదిమంది నిరసనలో పాల్గొన్నారు. పురసభ రెవెన్యూ అధికారి అథావుల్లా, అకౌంటెంట్ శ్రీధర్‌కు వినతిపత్రం సమర్పించారు. స్థానిక ప్రముఖుడు డాక్టర్ అనిల్‌ఉమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు గ్రామాలలో సరైన రోడ్లు, పాఠశాలలు లేవన్నారు. తాగునీటికోసం గత 12 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. అయితే గతంలో కమ్యూనిస్టు నేతలు ఎమ్మెల్యేలు అప్పస్వామిరెడ్డి, శ్రీరామరెడ్డిల మూడేళ్ల పాలనలో చిత్రావతి, వండమాన్, దేవికుంటె, సింగప్పగారిపల్లి, గుమ్మనాయకనపాళ్య, తుంగేటి దిన్నె సహా పలు గ్రామాలకు రోడ్లు, తాగేందుకు చిత్రావతి డ్యాం, ప్రభుత్వ పాఠశాలలు, హోబళిలలో పీయూ కళాశాలల ఏర్పాటు చేశారన్నారు. ఇలా కాంగ్రెస్ పాలనకు, కమ్యూనిస్టు నాయకుల పాలనకు ఎంతో తేడా ఉందన్నారు. కేవలం రాజకీయం కోసం మాజీ సీఎం పేరు పెట్టడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. నిరసనలో స్థానిక ప్రముఖులు రామలింగప్ప, మంజూరు అహ్మద్, మునివెంకటప్ప, లక్ష్మీనారాయణరెడ్డి, హెచ్‌పీ రామనాథ్, కేవీ రామచంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

రంగస్థలానికి వన్నెతెచ్చిన మహనీయుడు

- కళాప్రపూర్ణుడు బళ్లారి రాఘవ 145వ జయంత్యుత్సవాల్లో రిజిస్ట్రార్ నాగరాజు


జ్యోతి వెలిగించి ఉత్సవాలను ప్రారంభిస్తున్న ప్రముఖులు



బళ్లారి, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): బళ్లారి రాఘవ కళాప్రపూర్ణుడని, రంగస్థలానికే ఆయన వన్నె తెచ్చిన మహనీయుడని, రాఘవ నటించిన తెలుగు, కన్నడ, ఆగ్ల నాటకాలు ఖండాల్లో ఖ్యాతి గడించారని విజయనగర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ నాగరాజు అభిప్రాయం వ్యక్తం చేశారు. బళ్లారి రాఘవ కళామందిరములో శనివారం రాఘవ 145 జయంత్యుత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. రెండురోజుల ఈ ఉత్సవాలు జరగనున్నాయి. రాఘవ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం రాయల్ సర్కిల్ వరకూ చిత్రపటంతో ఊరిగింపుగా ర్యాలీ చేపట్టారు.. అనంతరం రాఘవకళామందిలో జ్యోతిని వెలిగించి ఉత్సవాలు ప్రారంభిచారు. ఈ ఉత్సవాలకు అధ్యక్షుడు కే. కోటేశ్వరావు అధ్యక్షతన వహించారు. ముఖ్య అతిథిగా విజయనగర శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ నాగరాజు హజరై మాట్లాడారు. రాఘవ తెలుగు, కన్నడ, ఆగ్లం బాషల్లో అనేక నాటికలు ప్రదర్శించారన్నారు. రాఘవ నటన జీవితం కన్నా వాస్తవ జీవితంకు ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చావారన్నారు. సినీ రంగం కన్నా నాటక రంగంలోనే ఎక్కువగా నటించారన్నారు. రాష్ట్ర స్థాయిలో రాఘవ ఆవార్డును అందుకున్న డిగ్రీ నాగరాజు మాట్లాడుతూ రాఘవకు తెలుగు, కన్నడ భాషలు రెండూ రెండు కళ్ల లాంటిన్నారు. రాఘవ నేటి తరం వారికి ఆదర్శప్రాయుడన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు గౌరవ అధ్యక్షుడు కే. చెన్నప్ప, రాఘవకళామందిరం కమిటీ సభ్యులు రమేష్ గోపాల్, రామాంజినేయులు, ప్రభాకర్, రమణప్ప, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

రాష్ట్రస్థాయిలో రాఘవ అవార్డు గ్రహిత అయిన డింగ్రీ నాగరాజుకు రాఘవకళామందిరం తరుపున సన్మానం చేశారు. ఆయనకు వేదికపైనే శాలువా కప్పి పుష్పమాల వేసి సన్మానించారు.


రాష్ట్రస్థాయి రాఘవ అవార్డును అందుకుంటున్న నాగరాజు

ఆకట్టుకున్న నాటిక

తొలిరోజు జయంతోత్సవాల్లో భాగంగా కన్నడ నాటిక సమరసింహ సంగొళి రాయన్న నాటిక ప్రదర్శన చేశారు. ధార్వాడ్ కళాబృదంకు చెందిన కళాకారులు ఈ నాటికను ప్రదర్శించారు. ఈ నాటికి విశేషంగా అకట్టుకుంది


విశేష అలంకరణలో నాగమ్మ అమ్మవారు

8

అమ్మవారికి ప్రత్యేక పూజలు

కెనరా బ్యాంకు హాకథాన్ పోటీల విజేత లఖ్‌నవూ జట్టు

బెంగళూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కెనరాబ్యాంకు జాతీయస్థాయిలో నిర్వహించిన హాకథాన్ పోటీల్లో లఖ్‌నవూకు చెందిన అబ్దుల్‌కలాం టెక్నికల్ యూనివర్సిటీ జట్టు విజేతగా నిలిచింది. జట్టుకు మొదటి ప్రైజ్‌గా 5 లక్షల రూపాయలు బహూకరించారు. కెనరాబ్యాంకు అనుబంధంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (డీఎఫ్ఎస్), ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ)లు సహకారంతో నిర్వహించిన నేషనల్ సైబర్ హాకథాన్ ఫైనల్స్ పోటీలు శనివారం బెంగళూరులో జరిగాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ క్యాంపస్ రామారావు ఆడిటోరియంలో ఫైనల్స్ జరిగాయి. కెనరాబ్యాంకు ఎండీ సీఈఓ కే సత్యనారాయణరాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా హాకథాన్ పోటీలు నిర్వహించామన్నారు. 6824 విద్యార్థులు 4723 జట్లుగా పోటీ పడ్డారు. వివిధ దశలలో సాగిన పోటీల తర్వాత చివరగా పది జట్ల నుంచి 39మంది గ్రాండ్ ఫినాలెలో తలపడ్డారు. రెండో ప్రైజ్‌ను పూనెకు చెందిన విశ్వకర్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నిలవగా రూ.3లక్షల నగదు పొందింది. మూడో స్థానంలో కొట్టాయంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ జట్టు నిలవగా రూ.2లక్షలు నగదు బహుమతికి ఎంపికయ్యారు. మరో రెండు జట్లకు రూ.50వేలు చొప్పున నగదు బహుమతిని ఇచ్చామని, ఫైనల్స్‌లో తలపడిన మిగిలిన ఐదు టీమ్‌లకు రూ.25వేలు చొప్పున బహుమతిగా ఇచ్చామన్నారు. 12.25 లక్షల రూపాయల నగదును గ్రాండ్ ఫినాలెలో తలపడిన జట్లకు అందించామన్నారు. విద్యార్థులనుద్దేశించి ఆధునికత, సైబర్ భద్రత కల్పించే ప్రక్రియలో కెనరాబ్యాంకు ఇటువంటి సాంకేతికమైన పోటీలు నిర్వహిస్తున్నందుకు గర్వపడుతున్నామన్నారు. ఇది డిజిటల్ ఇండియా సురక్షిత, ఆర్థిక పర్యావరణ వ్యవస్థను నిర్మించేందుకు దోహదపడుతుందన్నారు. రిజర్వుబ్యాంకు జనరల్ మేనేజర్ శైలజారాణి మాట్లాడుతూ హాకథాన్ పోటీలు సంతృప్తినిచ్చాయని క్రీడాకారులను అభినందిస్తున్నానన్నారు. ఐఐఎస్‌సీ రిజిస్ట్రార్ కేప్టెన్ శ్రీధర్ వారియర్‌తోపాటు కెనరాబ్యాంకు ఈడీలు హర్‌దీప్‌సింగ్ అహ్లూవాలియా, భవేంద్రకుమార్‌లు పాల్గొన్నారు. ఐబీఏ సీఈఓ ఏకే గోయల్ మాట్లాడుతూ హాకథాన్ ప్రస్తుత ప్రపంచంలో బ్యాంకింగ్ సవాళ్లను పరిష్కరించే యువత ఆలోచనలో శక్తిని ప్రతిబింబించేందుకు దోహదపడతాయన్నారు. ఆధునికత, సురక్షితం డిజిటల్ బ్యాంకింగ్‌లో అవగాహనకు కారణమవుతాయన్నారు.


విజేత బృందంతో కెనరా బ్యాంకు ఎండీ, సీఈఓ సత్యనారాయణరాజు తదితరులు


హత్యాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శోభారాణి

చెల్లిని వేధిస్తున్నాడని బావను కడతేర్చాడు

- బళ్లారి జిల్లా ఎత్తిన బూదేహాళ్‌లో దారుణ హత్య

8

చెల్లిని చంపిన కేసులో సోదరుడికి జీవిత ఖైదు

- ఆస్తి కోసం జరిగిన దారుణ హత్యలో బళ్లారి కేజేకే జిల్లా 2వ సెషన్స్ కోర్టు తీర్పు

పూల రైతుకు ధరల కటాక్షం..!

శ్రావణం రాకతో రెట్టింపైన రేట్లు

అన్నదాతకు లాభాలు

నిలకడగా కొనసాగుతాయని ఆశాభావం



కదిరి మార్కెట్‌లో పూల విక్రయాలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న బంతిపూలు

కదిరి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పూల రైతులకు ఆనందం మోసుకొచ్చింది. నిన్నమొన్నటి వరకు నేలచూపులు చేసిన పూల ధరలు ఒక్కసారిగా రెట్టింపయ్యాయి. ఈ నెలలో పండుగలు, వరలక్ష్మీ వ్రతాలు, పెళ్లిళ్ల ఇతర శుభ కార్యాలయాలు అధికంగా ఉండడంతో పూలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో ధరలు రెట్టింపయ్యాయి. కొన్నింటి రేట్లు అంతకుమించి పెరిగాయి. కార్తీక మాసం వరకు నిలకడగా ఉంటాయని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రెట్టింపైన ధరలు

నాలుగు నెలలుగా పూల ధరలు భారీగా తగ్గిపోయాయి. ఎండాకాలం, నీరు సమృద్ధిగా లేక పంట దిగుబడి కూడా అంతంత మాత్రమే వచ్చింది. కొంతమంది రైతులు పూలకు ధరలేక పంటను తొలగించారు కూడా. శ్రావణ మాసం ప్రారంభం కావడంతో పూల ధరలు పెరుగుతున్నాయి. ఇప్పటికే దాదాపు రెట్టింపయ్యాయి. పండుగలకుతోడు పెళ్లిళ్ల ఇతర శుభకార్యాలు ఉండడంతో ధరలు నిలకడగా ఉంటాయని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. కనకాంబరం ధర కిలో ఇటీవలి వరకు రూ.250కి దాటలేదు. శ్రావణ మాసం రాకతో కిలో రూ.600 పలుకుతోంది. ఇటీవలి వరకు రూ.250కిలోపే పలికిన మల్లెపూలు ప్రస్తుతం రూ.350 నుంచి 400 వరకు పలుకుతున్నాయి. బంతి పూల ధర కూడా దాదాపు రెట్టింపయింది. కిలో బంతిపూల ధర గతంలో రూ.30 నుంచి రూ.40 వరకు ఉండేది. ప్రస్తుతం రూ.70 నుంచి రూ.80 వరకు పలుకుతోంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. దసరాకు రూ.వందకి చేరుతుందని వ్యాపారులు చెబుతున్నారు. గులాబీల ధర కూడా రూ.50 వరకు పెరిగిందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

రైతుల్లో ఆనందం

కదిరి ప్రాంతంలో ముఖ్యంగా తనకల్లు, నల్లచెరువు, గాండ్లపెంట, ఓబుళదేవరచెరువు, అమడగూరు, తలుపుల, కదిరి రూరల్ ప్రాంతాల్లో పూల సాగు ఎక్కువగా ఉంటుంది. నీటి వసతిని బట్టి 25 సెంట్ల నుంచి ఎకరాల విస్తీర్ణంలో పంట పెడతారు. కనకాంబరం వివిధ మండలాల్లో ఎకరా నుంచి రెండు ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. ఈ మూడేళ్ల వరకు ఉంటుంది. నిన్నమొన్నటి వరకు ధరలు లేకపోవడంతో గిట్టుబాటు కాదని కొందరు రైతులు పంటను తొలగించుకున్నారు. పంటను అలాగే ఉంచున్న రైతులు ప్రస్తుతం సంబరపడుతున్నారు. ధరలు పెరగడంతో వారికి లాభాల పంట పండుతోంది.

నష్టపోయింది లేదు..



పదేళ్లుగా కనకాంబరం సాగుచేస్తున్నా. అరెకరాలో నాలుగు విడతలుగా పంట పెడతా. రోజూ పూలను కదిరి మార్కెట్‌కు తరలిస్తున్నా. తద్వారా వచ్చే డబ్బుతో ఇంటి అవసరాలు తీరిపోతాయి. పూలతోటలసాగులో నష్టపోయింది లేదు. ప్రస్తుతం కనకాంబరం కిలో రూ.600 పలుకుతోంది. తద్వారా లాభాలు వస్తున్నాయి.

- సుధాకర్, రైతు, చిన్నరామన్నగారిపల్లి

లాభాలు వస్తున్నాయి



ఎకరాలో బంతి పూలు సాగు చేశా. శ్రావణ మాసం రాకతో ధరలు బాగున్నాయి. గతంలో కిలో రూ.30 పలికేవి. ప్రస్తుతం పూల నాణ్యతను బట్టి రూ.70నుంచి రూ.100 వరకు పలుకుతున్నాయి. ఎకరాలో పంట సాగుకు రూ.50వేలకుపైగా ఖర్చు చేశాం. మూడురోజులకోసారి 250 కేజీల దిగుబడి వస్తోంది. ధరలు బాగుండడంతో లాభాలు వస్తున్నాయి.

- రాఘవరెడ్డి, రైతు, కటారుపల్లి క్రాస్

నిరసిద్దాం రండి: వామపక్షాలు

- విద్యుత్ చార్జీలపై పార్టీలకు అతీతంగా ఉద్యమించాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష నాయకులు
- 5న విద్యుత్ కార్యాలయాల వద్ద ప్రజాసంఘాల నిరసన



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

అనంతపురం టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల దోపిడీని ఆపాలంటూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈనెల 5న చేపట్టనున్న నిరసనకు మద్దతిస్తున్నట్లు వామపక్ష పార్టీల నాయకులు వెల్లడించారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు నాగరాజు, ఎస్‌యూసీఐసీ రాఘవేంద్రలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే చార్జీలు పెంచమని చెప్పిన ప్రస్తుత పాలకులు కూడా అదనపు చార్జీలు కొనసాగించడం బాధాకరమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప మాట్లాడుతూ ప్రభుత్వ ఖర్చులు పెంచి ప్రజల నుంచి విద్యుత్ సర్దుబాటు చార్జీలు వసూలు చేయడం అన్యాయమన్నారు. 2022-23, 2023-24 సంవత్సరాల్లో వాడుకున్న కరెంటుకు బిల్లులు కట్టినా మళ్లీ అదనంగా రూ.15,485కోట్లు సర్దుబాటు చార్జీలను ప్రజలపై మోపారన్నారు. అదానీ కంపెనీ రాష్ట్రంలోని రెండుకోట్ల మంది వినియోగదారుల పాత మీటర్లు తొలగించి, కొత్త స్మార్ట్ మీటర్లు బిగిస్తోందన్నారు. విద్యుత్ పంపిణీ ప్రైవేటీకరణకు కార్పొరేట్లకు కట్టబెట్టడానికి చేస్తున్న కుట్రలో భాగమే ఇది అని పేర్కొన్నారు. ఎస్‌యూసీఐసీ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర మాట్లాడుతూ ఇప్పటికే బిగించిన స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ట్రూ అప్, ఇంధన సర్దుబాటు(ఎఫ్‌ఏపీపీసీ) చార్జీల విధానాన్ని పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపై ఐదో తేదీన విద్యుత్, ప్రభుత్వ కార్యాలయాల వద్ద చేపట్టే నిరసనలకు పార్టీలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజారెడ్డి, శ్రీరాములు, లింగమయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, నాగేంద్రకుమార్, రామాంజనేయులు, నాగమణి, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ వీరనారప్ప, సీపీఐఎంఎం, ఎస్‌యూసీఐసీ కమిటీల నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్



అధికారుల బాగోతం

- ప్రతి నెలా రూ.35 వేలు డ్రా
- రెవెన్యూ శాఖలో తహసీల్దార్ల దర్జా

సొంతకార్లకు అద్దె వసూలు

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కొందరు తహసీల్దార్ల కక్కుర్తితో రెవెన్యూశాఖ పరువు పోతోంది. ప్రతి నెలా అద్దె కారు కోసం ప్రభుత్వం చెల్లించే డబ్బు కోసం కొందరు తహసీల్దార్లు నిబంధనలకు నీళ్లొదిలి వ్యవహరిస్తున్నారు. అద్దె కార్లు కాకుండా సొంతకార్లే వాడుతూ బిల్లులు చేసుకుంటున్నారు. కుటుంబసభ్యులు, బంధువులు, బినామీల పేర్లతో కార్లు తీసుకుని వాడుకుంటున్నారు. ఎల్లో బోర్డున్న ఇతర కార్ల నంబర్లు పెట్టి ప్రతి నెలా రూ.35వేల బిల్లు డ్రా చేసుకుంటున్నట్లు సమాచారం. వీరిలో చాలామంది సొంతంగా డ్రైవింగ్ చేసుకుంటున్నా రు. మరికొందరు డ్రైవర్లపై ఆధారపడుతున్నారు. అంటే డ్రైవర్లున్నవారికి రూ.15వేల వరకు ఖర్చు వస్తుంది, లేని వారికి అది కూడా మిగిలిపోతుంది. మరి కొందరు ఘనులు నౌకర్లనే కారు డ్రైవర్లుగా వాడేస్తున్నారట. దీంతో ప్రభుత్వం అందజేసే మొత్తం రూ.35వేలు నేరుగా ఖాతాలో పడిపోతుంది. ఈ కార్ల బాగోతం శాఖలోని కొందరు ఉన్నతాధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలిసింది.

ప్రభుత్వ ఆదాయానికి గండి

రెవెన్యూ అధికారులు సొంత కార్లు ఉపయోగించడం వల్ల రెండు నష్టాలున్నాయి. అధికారులకు ప్రభుత్వం నుంచి ప్రతి నెలా రూ.35వేలు కారు సౌకర్యం కోసం ప్రభుత్వం నిధులు ఇస్తోంది. కానీ అధికారులు దుర్వినియోగం చేస్తున్నారు. ఏదైనా అద్దె కారు తీసుకుంటే సంబంధిత వాహన డ్రైవర్‌కు ఉపాధి కల్పించినవారవుతారు. దీంతో కొంతవరకు నిరుద్యోగ సమస్య తీరే పరిస్థితి ఉంది. ఎల్లోబోర్డు వాహనం ఉన్నవారు లైఫ్ ట్యాక్స్ కింద ప్రభుత్వానికి రూ.80వేలు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ప్రభుత్వ ఆదాయం కూడా పెరుగుతుంది. అయితే అధికారులు వైట్ బోర్డున్న సొంత వాహనాలు వాడుతుండటం వల్ల ప్రజలు, ప్రభుత్వానికి నష్టం కలుగుతోంది.

వీఆర్‌ఓలు, ఆర్‌ఐలదే పెట్రోల్, డీజిల్ బాధ్యత



రెవెన్యూ అధికారులు దర్జాగా ప్రతి నెలా డబ్బు గడించడమే కాకుండా కారుకు డీజిల్, పెట్రోల్ కూడా ఉచితంగానే పొందుతున్నట్లు తెలిసింది. ఏదైనా భూమి విషయంలో పని చేసి పెట్టినందుకు కొందరు పెట్రోల్, డీజిల్ పట్టిస్తుంటారని సమాచారం. ఎక్కువ మండలాల్లో వీఆర్‌ఓలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు(ఆర్‌ఐ)ల సహకారంతో పెట్రోల్, డిజిల్ పట్టిస్తున్న ట్లు తెలిసింది. పక్కన ఆదాయం పొందడంలో బిజీగా ఉండే వీఆర్‌ఓలు, ఆర్‌ఐలు తుది సంతకాల కోసం తహసీల్దార్లతోనే పని ఎక్కువగా ఉంటుంది. దీంతో తమ అధికారికి ఇలా డీజిల్, పెట్రోల్ పోయించడంతో పాటు కొన్ని ప్రొటోకాల్ వ్యవహారాల్లో అక్రమంగా సంపాదించిన సొమ్ములో కొంత ఖర్చు పెడుతుంటారని తెలిసింది.

విచారించి.. చర్యలు తీసుకుంటాం



జిల్లాలో తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు వైట్ బోర్డులున్న వాహనాలే వాడుతున్నట్లు నా దృష్టికి రాలేదు. వైట్ బోర్డులు ఉపయోగించి ఎల్లో బోర్డున్న వాహనాల నంబర్లతో బిల్లు పెట్టుకోవడం సరైంది కాదు. జిల్లాలో అందరూ చేస్తున్నారా, లేక కొందరేనా అనేది విచారించి చర్యలు తీసుకుంటాం.

- మలోల, డీఆర్‌ఓ

మార్పు కోసం తపించిన మహనీయుడు బళ్లారి రాఘవ

- కళాకారుల నివాళి
- రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డుల ప్రదానం



రాష్ట్ర, జిల్లాస్థాయి బళ్లారి రాఘవ అవార్డులు అందుకున్న కళాకారులు



అనంతపురం టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సమాజంలో మార్పు కోసం బళ్లారి రాఘవ పరితపించారని వక్తలు కొనియాడారు. దీని కోసం ఆయన రంగస్థలాన్ని వేదికగా చేసుకున్నారని అన్నారు. అనేక పౌరాణిక, సాంఘిక నాటకాలలో ఆయన జీవించారని అన్నారు. బళ్లారి రాఘవ 145వ జయంతిని పురస్కరించుకుని అనంతపురం నగరంలోని లలిత కళా పరిషత్ ఆవరణలో శనివారం సాయంత్రం 'బళ్లారి రాఘవ' అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది గాజుల పద్మజ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. డీఆర్వో మలోల, టౌన్ ప్లానింగ్ ఏడీ సువర్ణ తదితరులు హాజరై బళ్లారి రాఘవ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం 2025 సంవత్సరానికి మేరిగె రామలింగేశ్వరరావు(తెనాలి), భూపతి ధర్మారావు(రేపల్లె, గుంటూరు జిల్లా)కు రాష్ట్రస్థాయి బళ్లారి రాఘవ అవార్డును అందజేసి సత్కరించారు. పౌరాణిక నాటక కళాకారులు వాల్మీకి కుళ్లాయప్ప, మల్లెల జయరామ్‌కు జిల్లాస్థాయి బళ్లారి రాఘవ అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం 'గోవు మా లచ్చిమి' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. కళాకారులు వెంకటరామిరెడ్డి, అరుణ్‌బాబు, ఎస్‌యం బాషా, జ్యోతిరాణి తమదైన శైలిలో నటించి మెప్పించారు. కార్యక్రమంలో లలితకళా పరిషత్ ఉపాధ్యక్షుడు రామగోవింద్ సాగర్, వడ్డెర సంఘం నాయకుడు రాజేష్, నారాయణస్వామి, వెంకట సుబ్బయ్య, భగవాన్, రంగప్ప, రఘు, అస్లాంబాషా, లోకేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రవాణా వ్యవస్థ మెరుగుకు కేంద్రం చర్యలు

పుట్టపర్తి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రవాణా వ్యవస్థను మెరుగుపర్చేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంది. ఈక్రమంలోనే రాష్ట్రంలో వివిధ జాతీయ రహదారుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి జాతీయ రహదారులు, రవాణా శాఖ కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ శనివారం పాల్గొన్నారు. మంగళగిరి నుంచి వర్చువల్‌గా ఈ కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలోనే శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి ముదిగుబ్బలోని ఎన్‌హెచ్-42 రోడ్డు 8 కిలోమీటర్ల అభివృద్ధికి రూ.22 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ప్రకటించారు. కదిరి రైల్వే క్రాసింగ్ ఆర్‌ఓబీ నిర్మాణం రెండు కిలోమీటర్లకు రూ.65 కోట్లు ఖర్చు చేసి, ఆధునికీకరించి జాతికి అంకితమివ్వనున్నట్లు వారు ప్రకటించారు. వీటి నిర్మాణం వల్ల ట్రాఫిక్ సమస్య తగ్గి, రోడ్డుప్రమాదాల నియంత్రణ జరుగుతుంది. అలాగే పర్యాటకానికి ప్రోత్సాహం పెరిగి, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా వేగవంతం అవుతుంది.

కానిస్టేబుళ్లుగా 'వదాన్య' విద్యార్థులు

అనంతపురం వైద్యం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ఫలితాల్లో వదాన్య జనా సొసైటీ సంస్థ విద్యార్థులు సత్తా చాటారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నలుగురు విద్యార్థులు కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపియ్యారు. ఈ సందర్భంగా వదాన్య సంస్థ వ్యవస్థాపకులు అశోక్ పడపాటి విద్యార్థులను శనివారం అభినందించి మాట్లాడారు. తమ సంస్థ తరఫున ప్రతిభావంతులైన నిరుపేద, నిరాశ్రయ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా హాస్టల్ ఫీజులు, స్టైఫండ్, ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్నామని తెలిపారు. పోటీపరీక్షల నోటిఫికేషన్‌లకు అనుగుణంగా ప్రతిభాపరీక్షలు నిర్వహించి ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. అన్నిరకాల పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు.



కానిస్టేబుళ్లుగా ఎంపికైన వదాన్య విద్యార్థులు

రైతుల సేవకే ప్రాధాన్యం

- రూ.30 కోట్ల టర్నోవర్ సాధిస్తాం
- డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్



నెట్టెం వెంకటేష్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో రైతుల సేవకే అధిక ప్రాధాన్యం ఇస్తామని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్ నెట్టెం వెంకటేష్ తెలిపారు. డీసీఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నెట్టెం వెంకటేష్ 'ఆంధ్రజ్యోతి'తో పలు అంశాలు వెల్లడించారు.

ప్రశ్న: ఉమ్మడి అనంత జిల్లాలో డీసీఎంఎస్ బ్రాంచ్‌లు ఎన్ని ఉన్నాయి...?

జవాబు: అనంతపురం ప్రధాన కార్యాలయంతో పాటు ఒక బ్రాంచ్, తాడిపత్రి, కదిరి, హిందూపురం, పెనుకొండ, ధర్మవరం, కళ్యాణదుర్గంలో ఉన్నాయి.

ప్రశ్న: కొత్త బ్రాంచ్‌లు ప్రారంభించే అవకాశం ఉందా..?

జవాబు: త్వరలో పుట్లూరు మండలం కడవకల్లులో బ్రాంచ్ ప్రారంభిస్తాం. నియోజకవర్గానికి ఒక బ్రాంచ్ ఏర్పాటుపై అధ్యయనం చేస్తున్నాం.

ప్రశ్న: డీసీఎంఎస్ వార్షిక టర్నోవర్ ఎంత..?

జవాబు: వార్షిక టర్నోవర్ ప్రస్తుతం రూ.24కోట్లుగా ఉంది. దీనిని రూ.30 కోట్లకు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ప్రశ్న: డీసీఎంఎస్ ద్వారా రైతులకు ఏవిధమైన సేవలు అందిస్తున్నారు...?

జవాబు: రైతులకు ఎరువులు, మందులు, నిత్యావసర సరుకులు బహిరంగ మార్కెట్‌కంటే తక్కువకు అందిస్తున్నాం. ఆధునిక వ్యవసాయ యంత్రాలను తక్కువ ధరకే అందుబాటులో ఉంచాం.

ప్రశ్న: కొత్తగా ఏవైనా కార్యక్రమాలు చేపడుతున్నారా..?

జవాబు: డీసీఎంఎస్ ద్వారా సంక్షేమ హాస్టళ్లు, అంగన్‌వాడీలకు నిత్యావసర సరుకులు, ప్రభుత్వ కార్యాలయాలకు స్టేషనరీ సరఫరా.. దీపావళికి టపాసుల అమ్మకాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే వెంటనే ప్రారంభిస్తాం.

ప్రశ్న: డీసీఎంఎస్‌కు ఉమ్మడి జిల్లాలో ఎక్కడెక్కడ ఆస్తులు ఉన్నాయి...?

జవాబు: అనంతపురం ప్రధాన కార్యాలయంలో సుమారు 20వరకు షాపులు, గోడౌన్లు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో ఆర్‌ఎఫ్ రోడ్డులో షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. గుత్తి రోడ్డులో మూడు ఎకరాల స్థలంలో షాపులకు అద్దెకిచ్చాం. తాడిపత్రి, కదిరి, హిందూపురం, కళ్యాణదుర్గంలో షాపులు అద్దెకు ఇచ్చాం. డీసీఎంఎస్‌కు చెందిన ఆస్తులను పరిరక్షిస్తూ, ఆదాయం పెంచడపై ప్రత్యేక దృష్టి సారించాం.

ప్రశ్న: సొసైటీల ద్వారా ఎలాంటి కార్యక్రమాలను చేపట్టనున్నారు...?

జవాబు: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సొసైటీల ద్వారా రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో భాగమైన డ్రోన్‌లు అందజేసేందుకు చర్యలు చేపడుతున్నాం.

బోధనపై దృష్టి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెంపునకు అడుగులు

- పర్యవేక్షణకు ప్రత్యేక ప్రణాళికలు
- జిల్లా, మండలస్థాయిల్లో అకడమిక్ ఫోరం కమిటీలు
- 15 రోజులకోసారి రాష్ట్ర కమిటీ సమీక్ష
- జిల్లాలో అమలుకు కుస్తీ



ఎఫ్ఎల్ఎన్ ప్యానల్‌తో పాఠం చెబుతున్న టీచర్

అనంతపురం విద్య, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాంకేతికంగా బోధన వసతులు కల్పిస్తోంది. పలు పథకాలు, సౌకర్యాల కోసం రూ.కోట్లు ఖర్చు పెడుతోంది. అయినా విద్యాప్రమాణాలు మాత్రం ఆశించిన స్థాయిలో మెరుగుపడట్లేదు. కేంద్రం నుంచి వచ్చిన రెండు సంస్థల సర్వేల్లో ఈ విషయం స్పష్టమైంది. రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పిల్లల సామర్థ్యాలు అనుకున్న స్థాయిలో లేవని ఆ సంస్థలు తేల్చాయి. 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో సగం మందికి కూడికలు, తీసివేతలు కూడా రావడంలేదని, ఇంగ్లిష్ పదాలు చదవలేకపోతున్నారని నివేదికలు ఇచ్చాయి. పథకాలు అమలు చేస్తున్నా, సౌకర్యాలు కల్పిస్తున్నా.. విద్యాప్రమాణాలు ఎందుకు మెరుగు పడట్లేదన్న దానిపై మంత్రి నారా లోకేశ్, విద్యాశాఖల అధికారులు దృష్టి పెట్టారు. మెరుగు పరిచే దిశగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, అమలు చేయనున్నారు. ఆ దిశగా అకడమిక్ ఫోరం కమిటీలను నియమించి, పర్యవేక్షించాలని నిర్ణయించారు. కమిటీలను సైతం నియమించారు. కమిటీల పనితీరు, విద్యా ప్రమాణాల పెంపునకు తీసుకుంటున్న చర్యలపై 15 రోజులకోసారి రాష్ట్రస్థాయిలో సమీక్షించనున్నారు.

అకడమిక్ ఫోరం కమిటీలు

విద్యాప్రమాణాల పెంపు పర్యవేక్షణకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నారు. ఇందుకోసం జిల్లా, మండలస్థాయిల్లో అకడమిక్ ఫోరం కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాస్థాయిలో డీఈఓ చైర్మన్‌గా సమగ్రశిక్ష ఏపీసీ, ఏసీ, డీసీఈబీ కార్యదర్శి, ముగ్గురు ఎంఈఓలు సభ్యులుగా ఉంటారు. ప్రతి సబ్జెక్టుకు నలుగురు నిపుణులైన స్కూల్ అసిస్టెంట్లు చొప్పున 24 మంది టీచర్లను, ప్రాథమిక స్థాయిలో 1 నుంచి 5వ తరగతి వరకు పర్యవేక్షణకు జిల్లాస్థాయి కమిటీలో నలుగురు ఎస్జీటీ కేడర్‌లో నిపుణులైన టీచర్లకు అవకాశం కల్పించారు. మండలస్థాయిలోనూ నిరంతరం పర్యవేక్షణకు ఎంఈఓ-1, ఎంఈఓ-2, కాంప్లెక్స్ హెచ్‌ఎం, ముగ్గురు ఎస్జీ టీచర్లకు కమిటీలో అవకాశం కల్పించారు. జిల్లా కమిటీ సభ్యులు బృందాలుగా పాఠశాలలను పర్యవేక్షిస్తారు. విద్యార్థుల సామర్థ్యాలు, ప్రమాణాల పెంపునకు ఎలా బోధిస్తున్నారు, ఎన్‌రోల్‌మెంట్, పిల్లలు, టీచర్ల హాజరు, పాఠశాలలకు వచ్చిన నిధులు, వాటితో ఎలాంటి వసతులు కల్పించారు, డబ్బు ఎలా ఖర్చుపెట్టారు తదితరాలను పరిశీలిస్తారు. తనిఖీ చేసిన పాఠశాలలోని పరిస్థితులను కమిటీ రాసుకోవాల్సి ఉంటుంది. 15 రోజులకోసారి అకడమిక్ ఫోరం కమిటీలతో రాష్ట్రస్థాయిలో మంత్రి నారా లోకేశ్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్ సమీక్ష నిర్వహిస్తారు. కమిటీల పనితీరు, గుర్తించిన సమస్యలపై ఆరా తీస్తారు. ఆ దిశగా ఇప్పటికే కమిషనర్ నుంచి ఆదేశాలు రావడంతో జిల్లాలో అమలుకు అధికారులు కుస్తీ పడుతున్నారు.

కమిటీలతో నిత్యం పర్యవేక్షణ



ప్రభుత్వ పాఠశాలల్లో బోధన పర్యవేక్షణకు జిల్లా, మండల స్థాయిల్లో అకడమిక్ ఫోరంకమిటీలు ఏర్పాటు చేశాం. జిల్లా కమిటీని సైతం నియమించాం. విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపడతాం.

-ప్రసాద్‌బాబు, డీఈఓ

ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోండి


పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసయాదవ్

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాసయాదవ్ పేర్కొన్నారు. పరిశ్రమల శాఖ కార్యాలయంలో శనివారం ఆయన సబ్సిడీ లకు సంబంధించి పలు వివరాలను వెల్లడించారు. పెట్టుబడి సబ్సిడీ కింద ఓసీ జనరల్‌కు 25 శాతం రాయితీ ఉందన్నారు. విద్యుత్‌కు సంబంధించి యూనిట్‌కు రూ.1 మంజూరు చేస్తారన్నారు. వంద శాతం సేల్స్ ట్యాక్స్ రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. స్పెషల్ కేటగిరి కింద ఓసీ మహిళతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు పెట్టుబడి రాయితీ 45 శాతం ఇస్తామన్నారు. విద్యుత్‌ను యూనిట్‌కు రూ.1.5 ప్రకారం కేటాయిస్తామన్నారు. సేల్స్ ట్యాక్స్ మాత్రం అందరికి ఒకే విధంగా 100 రాయితీ ఇస్తారన్నారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కుంచె...

శ్రీపాద పినాకపాణి (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత శ్రీపాద పినాకపాణి 1913 ఆగస్టు 3న శ్రీకాకుళం జిల్లా ప్రియ అగ్రహారంలో జన్మించారు. రోగాలను, రాగాలను సరిచేసిన సవ్యసాచి. డాక్టర్, ప్రొఫెసర్‌గానే కాకుండా కర్ణాటక సంగీతంలో సత్తా చాటుకుని వైద్య, సంగీత రంగాలలో ఆయన శిష్యులు సైతం పేరొందారు. 2012లో టీటీడీచే ఙ్ఞాన విద్యా వారధి పురస్కారం అందుకున్నారు. సంగీత కళానిధి, సంగీత కళాశిఖామణి, సంగీత నాటక అకాడమీ, కళాప్రపూర్ణ పురస్కారాలు అందుకున్నారు. సంగీతం వింటూనే నొటేషన్స్ రాయగల నైపుణ్యం ఆయనది. గురువులకే గురువుగా రాణించారు. విశాఖపట్నంలో వైద్యకళాశాల సివిల్ సర్జన్‌గా పనిచేశారు. అన్నమాచార్య కృతులు 108, త్యాగరాజ కృతులు 607, ముత్తుస్వామి దీక్షితుల కృతులు 173 తదితర వాటికి ఆయన స్వరపరిచారు. 2013 మార్చి 11న దివంగతులయ్యారు.

షకీల్ బదయూని (జయంతి)



షకీల్ బదయూని 1916 ఆగస్టు 3న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బదయూన్ ప్రాంతంలో జన్మించారు. బాలీవుడ్‌లో ఉర్దూ కవిగా, స్వరకర్తగా, హిందీ సినిమాలకు గేయ రచయితగా పేరొందారు. బైజు బావ్రా, మొఘల్-ఎ-ఆజమ్, బీస్ సాల్ బాద్, చౌద్విన్ కా చాంద్, సాహిబ్ బీబీ ఔర్ గులాం తదితర సినిమాలకు పాటలు రాశారు. నౌషాద్‌తో కలసి షకీల్ రాణించారు. ఫిల్మ్ ఫేర్ పురస్కారాలతోపాటు ఉత్తమగీత రచయితగా పేరొందారు. కేంద్రప్రభుత్వంచే 'గీత్ కర్-ఏ-ఆజం' పురస్కారం అందుకున్నారు. 1970 ఏప్రిల్ 20న కన్నుమూశారు. 2013లో ఆయన జ్ఞాపకార్థం పోస్టల్‌స్టాంపు విడుదలైంది.

స్వామి చిన్మయానంద (వర్ధంతి)



హిందూ ఆధ్యాత్మికవేత్త స్వామి చిన్మయానంద సరస్వతి 1916 మే 8న కేరళ రాష్ట్రం ఎర్నాకులంలో జన్మించారు. పూర్వనామం బాలకృష్ణ మీనన్. ఉపాధ్యాయుడిగా రాణించారు. చిన్మయా మిషన్ ఏర్పాటు చేసి అద్వైత వేదాంతం, భగవద్గీత, ఉపనిషత్తులు, పురాణాల గురించి ప్రచారం చేశారు. దేశ విదేశాలలో 300కుపైగా శాఖలు ఉన్నాయి. విశ్వహిందూ పరిషత్ స్థాపనలోనూ కృషి చేశారు. 1970లో బెంగళూరులో చిన్మయా మిషన్ హాస్పిటల్ ఏర్పాటు చేశారు. 200 పడకలతో ఆధునీకరించారు. 1993 ఆగస్టు 3న కన్నుమూశారు. ఇప్పటికీ మిషన్ సేవలు కొనసాగతున్నాయి. 2015లో ఆయన జ్ఞాపకార్థం ప్రత్యేక కాయిన్ విడుదల చేశారు.

వాణిశ్రీ (పుట్టినరోజు)



వెండితెరపై కళాభినేత్రిగా పేరొందిన దక్షిణాది ప్రముఖ నటీమణులలో ఒకరైన వాణిశ్రీ 1948 ఆగస్టు 3న నెల్లూరులో జన్మించారు. అసలు పేరు రత్నకుమారి. నాలుగు దశాబ్దాలలో తెలుగు, తమిళ, కన్నడ హిందీ భాషలలో ఎన్నో సినిమాలలో నటించారు. 'నాదీ ఆడజన్మే' చిత్రంలో అవకాశానికి వెళ్లినప్పుడు ఎస్వీ రంగారావు ఆమెకు 'వాణిశ్రీ' అనే పేరు పెట్టారు. రఘుపతి వెంకయ్య అవార్డు, 3 ఫిల్మ్‌ఫేర్, నంది, తమిళనాడు రాష్ట్ర పురస్కారాలు అందుకున్నారు. 1970 దశకంలో ఆమె హీరోయిన్‌గా నటించిన దసరాబుల్లోడు, ప్రేమనగర్ సినిమాలు ఎంతో పేరొందాయి. సామాజిక సేవలో భాగంగా పాఠశాలల అభివృద్ధికి చేయూత అందించారు.

సభాపతి పీఠమే లక్ష్యం



- పరిషత్‌లో పట్టు సాధించడానికి కాంగ్రెస్ కసరత్తు
- నాలుగు ఎమ్మెల్సీ స్థానాల భర్తీకి అధిష్ఠానంతో చర్చలు

బెంగళూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు ముగిసింది. ఇంకా విధాన పరిషత్ పూర్తిస్థాయిలో ప్రతిపక్ష బీజేపీ - జేడీఎస్‌వైపే ఉంది. ప్రభుత్వం ఎటువంటి బిల్లులు ప్రవేశపెట్టాలన్నా శాసనసభలో మెజారిటీ ద్వారా సులభంగా ఆమోదం లభిస్తోంది. అయితే పరిషత్‌లో అటువంటి అవకాశం లేకుండా పోవడంతో ప్రభుత్వానికి ప్రతి బిల్లు ఆమోదం పొందడం పెను సవాల్‌గా మారుతోంది. పరిషత్ సభాపతి హోదాను దక్కించుకోవాలని కాంగ్రెస్ పార్టీ కసరత్తు ప్రారంభించింది. ఆ దిశగా సీఎం సిద్దరామయ్య ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

రాష్ట్ర శాసనసభలో 224మంది ఎమ్మెల్యేలు కాగా మ్యాజిక్ నెంబరు 113గా ఉంది. కాంగ్రెస్ పార్టీకి 135మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. దీంతో శాసనసభలో ప్రతిపక్ష బీజేపీ-జేడీఎస్‌లకంటే అధికార కాంగ్రెస్‌దే హవా సాగుతోంది. ప్రతిపక్షంలో వందమందిదాకా శాసనసభ్యులు ఉంటే ఎంతోకొంత పోరాడేవారు. కానీ కాంగ్రెస్‌కు 20మంది ఎమ్మెల్యేలు అత్యధికంగా ఉన్నారు. ప్రభుత్వం ఏదైనా బిల్లు అమలు చేయాలంటే శాసనసభలో ప్రతిపక్షాలనుంచి ఎన్ని విమర్శలు వచ్చినా సులభంగా ఆమోదం పొందుతున్నారు. కానీ విధానపరిషత్‌లో ఆ పరిస్థితి కాంగ్రెస్‌కు ఇంకా దక్కలేదు. పరిషత్‌లో మొత్తం 75 స్థానాలు ఉన్నాయి. ఇందులో కాంగ్రెస్ పార్టీకి 33మంది, బీజేపీకి 30మంది, జేడీఎస్ పార్టీ ఎమ్మెల్సీలు ఏడుగురు ఉన్నారు. ఇండిపెండెంట్ ఎమ్మెల్సీ బెళగావికి చెందిన లఖన్ జార్కిహోళి ఉన్న విషయం తెలిసిందే. ఇప్పటిదాకా లఖన్ బీజేపీవైపే ఉన్నారు. కాగా నాలుగుస్థానాలు ఖాళీగా ఉన్నాయి. సభాపతి ఓటు ఓట్లలెక్కింపు పరిగణనలోకి రాదు. దీన్నిబట్టి 74మంది ఎమ్మెల్సీలలో 37మంది ఏ పార్టీకి ఉంటే వారికే సభాపతి హోదా దక్కనుంది. పరిషత్‌లో 4 స్థానాల భర్తీకి సీఎం సిద్దరామయ్య గడిచిన రెండు నెలలుగా తీవ్రమైన కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే నలుగురి పేర్లను ఖరారు చేశారు. వీరికి జూలైలోనే నామినేషన్ పద్ధతిన ఎంపిక చేస్తారని చర్చలు సాగాయి. కానీ అధిష్ఠానం వాయిదా వేస్తూ వస్తోంది. జూలైలో రెండుసార్లు ఢిల్లీ పర్యటన వెళ్లిన ముఖ్యమంత్రి సిద్దరామయ్య, కాంగ్రెస్ కీలకనేత రాహుల్‌గాంధీని భేటీ కాలేకపోయారు. ఇటీవల వారంలో రెండుసార్లు ఢిల్లీ వెళ్లినా సమావేశంలో మినహా ప్రత్యేకంగా కలిసే అవకాశం లభించలేదు. దీంతో ఎమ్మెల్సీ పేర్లకు ఆమోదముద్ర సాధ్యం కావడం కాలేదు. ఇప్పటికే ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే వద్ద చర్చలు జరిగినా రాహుల్‌గాంధీ ఆమోదిస్తే అభ్యంతరం లేదని సూచించినట్టు తెలుస్తోంది. ఖాళీగా ఉండే నాలుగు ఎమ్మెల్సీ స్థానాలను భర్తీ చేసుకుంటే కాంగ్రెస్‌కు 37మంది ఎమ్మెల్సీలు అవుతారు. సభాపతి హోదా దక్కించుకోవచ్చునని భావిస్తున్నారు.

- ప్రస్తుతం సభాపతి బసవరాజహొరట్టి కర్ణాటకలోనే కాకుండా దేశంలోనే అత్యధిక సార్లు ఎమ్మెల్సీగా గెలుపొందిన వారిగా రికార్డు ఉంది. ప్రస్తుతం ఏడోసారి ఎమ్మెల్సీగా బసవరాజహొరట్టి కొనసాగుతున్నారు. ఆయన సీనియారిటీపట్ల అన్ని పార్టీల ముఖ్యనేతలకు అపారమైన గౌరవం ఉంది. అందుకే గతంలో జేడీఎస్-కాంగ్రెస్ మద్దతుతో కొంతకాలం సభాపతిగా వ్యవహరించారు. ఇటీవల బీజేపీ ప్రభుత్వకాలంలో కమలదళంలో చేరారు. ఇలా సభాపతి హోదా పొందిన బసవరాజహొరట్టి రెండేళ్ల కాంగ్రెస్ పాలనలోనూ ఎటువంటి విమర్శలు లేకుండా కొనసాగుతున్నారు. పైగా సీఎం సిద్దరామయ్యకు హొరట్టి అంటే ప్రత్యేక అభిమానం ఉంది.



బసవరాజహొరట్టి | బీకే హరిప్రసాద్ | సలీం అహ్మద్

- ప్రస్తుతం విధానపరిషత్‌లో కాంగ్రెస్ సీనియర్లలో బీకే హరిప్రసాద్, విప్ సలీం అహ్మద్‌లు ఉన్నారు. వీరితోపాటు ప్రకాశ్ హుక్కేరి గతంలో మంత్రిగా, లోక్‌సభ సభ్యుడిగా కొనసాగినవారు. ఇక పార్టీలు వేరైనా గతంలో జేడీఎస్, ఆ తర్వాత బీజేపీ ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీగా ఉన్న పుట్టణ్ణపేరు వినిపిస్తోంది. ఇక ఎంఆర్ సీతారాం, ఉమాశ్రీలు గతంలో మంత్రులుగా పనిచేసినవారే. ఐవాన్ డిసౌజా పేరు కూడా ఇటీవల తెరపైకి వచ్చింది. నాలుగుస్థానాలు భర్తీ చేసేవరకు సభాపతి విషయంలో ముందడుగు సరికాదని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. అవిశ్వాస తీర్మానం మాట వస్తే సభాపతి హోదాకు రాజీనామా చేస్తానని హొరట్టి గత ఏడాది బెళగావిలో జరిగిన శాసనసభ శీతాకాల సమావేశాల్లోనే తేల్చిచెప్పారు. ఈ ఏడాది బడ్జెట్ సమావేశాల సందర్భంలోనూ అవే వ్యాఖ్యలు చేశారు. అయితే కేబినెట్ విస్తరణ అంశం ఏడాదిగా వాయిదా పడుతూ వస్తోంది. ఎప్పుడైనా అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వచ్చునని ఎదురుచూస్తున్నారు. అదే జరిగితే సభాపతి హోదా కంటే మంత్రులు కావాలని బీకే హరిప్రసాద్, సలీం అహ్మద్‌లు భావిస్తున్నారు. కేబినెట్‌లో చోటు లేదంటే సభాపతి హోదా ఇద్దరిలో ఒకరికి వరించనుంది. కేబినెట్‌లో బీకే హరిప్రసాద్ తీసుకునే విషయమై సీఎం సిద్దరామయ్య ఇప్పటికే హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఇక సలీం అహ్మద్ సభాపతి రేసులో ఉన్నా శాసనసభ స్పీకర్‌గా యూటీ ఖాదర్ కొనసాగుతున్నందున ఇతడికి సభాపతి హోదా అవకాశాలు ఉండవు. కాంగ్రెస్ అధిష్ఠానం అనుమతి ఇచ్చేదాకా కేబినెట్, ఖాళీగా ఉండే నాలుగు ఎమ్మెల్సీ స్థానాల భర్తీలో ఏ విధమైన మార్పులు ఉండవు.



కేపీసీసీ కన్వీనర్ కేవీ రాజీవ్‌గౌడను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేంద్రం చేతిలో ఈసీ కీలుబొమ్మ

- కేపీసీసీ కన్వీనర్ కేవీ రాజీవ్‌గౌడ

శిడ్లఘట్ట, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో ఎన్నికల కమిషన్ కీలుబొమ్మగా మారిందని, నకిలీ ఓటర్లను సృష్టించే అంశంపై ఓటర్లలో జాగృతి కల్పించాల్సిన అవసరం ఉందని కేపీసీసీ కన్వీనర్ కేవీ రాజీవ్‌గౌడ అభిప్రాయపడ్డారు. అందుకుగాను కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా నిరసన చేపట్టనుందన్నారు. ఓట్ల చౌర్యం అంశంపై ఈనెల 5న బెంగళూరులో చేపట్టే భారీ నిరసనకు సంబంధించి పట్టణంలోని కాంగ్రెస్ భవనంలో శనివారం సన్నాహకసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గౌడ మాట్లాడుతూ నిరసనకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు పాల్గొంటారన్నారు. నిరసనకు తాలూకా నుంచి కనీసం 5వేలమంది కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అన్ని గ్రామపంచాయతీలనుంచి బస్సు వ్యవస్థ కల్పిస్తామన్నారు. కాగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీకల్ రామచంద్రేగౌడ చేసిన వ్యాఖ్యలకు స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీని ఎవరూ నాశనం చేయలేరన్నారు. సమావేశంలో కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో పలుచోట్ల అక్రమ మార్గంలో ఎన్నికలు జరుగుతున్నాయని తద్వారా బీజేపీ ఎమ్మెల్యేలు గెలుస్తున్నారన్నారు.

అందానికి ప్రతిబింబం..!



నీటిలో వేడుకల ప్రతిబింబం

కంప్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిచెందిన పర్యాటక ప్రాంతం హంపిలో శనివారం చిరుజల్లు కురిశాయి. వాతావరణం చల్లబడడంతో పర్యాటకులు పులకించిపోయారు. విరూపాక్షేశ్వరుడి సన్నిధిలో వర్షపు నీరు నిలిచిపోయింది. ఆ నీటిలో మండపాల ప్రతిబింబాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కొద్దిపాటి వర్షమే కావడంతో సాయంత్రం పల్లకి సేవ కార్యక్రమాలు యథావిధిగా జరిగాయి. శ్రావణ శనివారం సందర్భంగా ఆంధ్ర, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, గోవా, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పర్యాటకులు పోటెత్తారు.

చీనీ రూ.15 వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.10వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా722 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అనంతపురం క్రైం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): యాడికి మండలం రాయలచెరువుకు చెందిన బలపం రాయి వ్యాపారి వెంకటరమణ నాయుడు(43) రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అనంతపురం రూరల్ పోలీసులు శనివారం తెలిపిన మేరకు వెంకటరమణ తన వ్యాపారం నిమిత్తం శుక్రవారం అనంతపురం వచ్చాడు. పనికాకపోవడంతో మరో పని మీద రాత్రి 10 గంటలప్పుడు కాటిగానికాల్వకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రాత్రి ఒంటిగంట సమీపంలో బీజేపీ కాలనీ ఆర్చ్ సమీపంలో కుక్క అడ్డురావడంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గొల్లపల్లికి వస్తే చాలు..!

- 15రోజుల్లో మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీటి విడుదల
- లైనింగ్ పూర్తయితే 2వేల క్యూసెక్కుల సరఫరా

పెనుకొండ రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి నుంచి గొల్లపల్లి రిజర్వాయర్‌కు నీరు వచ్చిన తక్షణం మడకశిర బ్రాంచ్ కాలువకు విడుదల చేసేందుకు హెచ్ఎన్ఎస్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నీటి సామర్థ్యం 1.92టీఎంసీలుకాగా ప్రస్తుతం 1.2టీఎంసీల నీటి నిల్వ ఉంది. 15రోజుల్లోగా మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీటిని విడుదల చేస్తామని హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు తెలిపారు. కాగా గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్ లైనింగ్ పనులను రూ.4కోట్లతో చేయనున్నట్లు సంబంధిత అధికారలుఉ తెలిపారు. గతంలో ఈ కెనాల్ ద్వారా హిందూపురం, మడకశిర నియోజకవర్గాలలోని చెరువులకు హంద్రీనీవా కాలువ ద్వారా వెయ్యి నుంచి 1200క్యూసెక్కుల నీరు సరఫరా అయ్యేది. లైనింగ్ పనులు పూర్తయితే గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా 2వేల క్యూసెక్కుల నీరు సరఫరా అవుతుందని హెచ్ఎన్ఎస్ అధికారులు చెబుతున్నారు. హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లోని చెరువుల చివరి ఆయకట్టు వరకు నీరు అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు.



మడకశిర బ్రాంచ్ కెనాల్



కొత్తపల్లివద్ద జరుగుతున్న హంద్రీనీవా లైనింగ్ పనులు

ఆదిహనుమంతరాయుడికి పూజలు



ముళబాగిలు, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుణిగుంటపాళ్యలో కొలువైన పురాణ ప్రసిద్ధమైన ఆది హనుమంతరాయస్వామి దేవాలయంలో శ్రావణ శనివారం పురస్కరించుకుని విశేషపూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఉదయం మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, విశేష పుష్పాలంకరణ చేశారు. ఆలయ అర్చకులు ఏఎస్ శేషాద్రి నేతృత్వంలో పూజాకైంకర్యాలు జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయాన్ని తోరణాలతో ముస్తాబు చేశారు. సేవాకర్తలు ప్రత్యేకంగా ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ అధ్యక్షుడు టీహెచ్ తేజారమణ కార్యక్రమాలకు నేతృత్వం వహించారు.

జర్మనీలో నర్సు ఉద్యోగావకాశాలు

కదిరి, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): నర్సింగ్ చేసినవారికి జర్మనీలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి నాగార్జున శనివారం ప్రకటనలో తెలిపారు. ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చేసినవారికి జర్మన్ భాష నేర్పించి, ఆ దేశంలో నర్సులుగా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు 9390176421 నంబరులో సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్ల పనిచేస్తున్న టీచర్లు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ కిష్టప్ప శనివారం ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 5న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డులను అందజేస్తోందన్నారు. దరఖాస్తులను ఈనెల 8వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు ఉప విద్యాశాఖాధికారి, మండల విద్యాశాఖాధికారికి మూడు సెట్లు చొప్పున అందజేయాల్సి ఉంటుందన్నారు.

- కనీసం 10 సంవత్సరాల బోధనానుభవం కలిగి ఉండాలి
- జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొంది ఉండాలి.
- రాష్ట్రస్థాయిలో ఇదివరకే అవార్డు తీసుకున్న వారు అనర్హులు.
- దరఖాస్తుదారులపై క్రిమినల్ కేసులు ఉండరాదు. శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు ఉన్నవారు అనర్హులు.

అయ్యో.. దేవుడా..

- మధురైలో రోడ్డు ప్రమాదం
- ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు బీటెక్ విద్యార్థుల దుర్మరణం
- బాధిత కుటుంబాల్లో విషాదం

కుందుర్పి/ముదిగుబ్బ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఆ ఇళ్ల ఆశాదీపాలను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. అంతులేని శోకం మిగిల్చింది. తమిళనాడులోని మధురైలో శనివారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో ఉమ్మడి జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థులు రోహిత్ (22), కార్తీక్ (22) దుర్మరణం చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ఒక్కగానొక్క కుమారుడు..

కుందుర్పి మండలంలోని మాయదార్లపల్లికి చెందిన వలస మూర్తి, రూప దంపతులకు కుమార్తెలు మేఘన, ఐశ్వర్య, కుమారుడు రోహిత్ ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఒక్కగానొక్క కుమారుడిని ఉన్నత చదువులు చదివించాలన్న ఉద్దేశంతో మధురై జిల్లాలోని కలసలింగం యూనివర్సిటీలో బీటెక్ చదివిస్తున్నారు. అదే కాలేజీలో ముదిగుబ్బలోని నాయీబ్రాహ్మణ కాలనీకి చెందిన శ్రీనివాసులు, లీలావతి దంపతుల కుమారుడు కార్తీక్ చదువుతున్నాడు. ఇద్దరూ బీటెక్ మూడో సంవత్సరం చదువుతుండేవారు. శుక్రవారం సాయంత్రం కాలేజీ ముగించుకుని, హాస్టల్‌కు ఇద్దరూ బైక్‌పై బయల్దేరారు. ప్రమాదవశాత్తు బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందారు. వెంటనే పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని, ఐడీ కార్డు ఆధారంగా సమీప యూనివర్సిటీకి సమాచారాన్ని అందించారు. కుటుంబ సభ్యులకు విషయం తెలిపారు. తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. వెంటనే మధురైకి తరలి వెళ్లారు. కార్తీక్‌కు అన్న ఉన్నాడు. సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు.



కార్తీక్, రోహిత్ (ఫైల్)

క్రైం కార్నర్

219 గంజాయి చాక్లెట్ల పట్టివేత



పట్టుబడిన నిందితుడితో పోలీసులు

అనంతపురం క్రైం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 219 గంజాయి చాక్లెట్లను త్రీటౌన్, ఈగల్ సెల్, జీఆర్పీ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా అరికట్టడంలో భాగంగా ఉదయం తనిఖీలు నిర్వహించారు. త్రీటౌన్, ఈగల్ సెల్, గవర్నమెంట్ రైల్వే పోలీసుల సంయుక్తంగా తనిఖీలు చేశారు. అనంతపురం నుంచి ధర్మవరం వెళ్లే 18463 నంబర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో ఉదయం 6.20 గంటలకే తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఒడిసాకు చెందిన సాల్మన్ అనే ప్రయాణికుడి వద్ద గంజాయి పదార్థం ఉన్న 219 చాక్లెట్లు గుర్తించి, పట్టుకున్నారు. పట్టుబడిన వ్యక్తిపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

స్కూటర్ డిక్కీలోని నగదు చోరీ



నగదు దోచుకెళ్లిన అనుమానితులు

కదిరి, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): స్కూటర్ డిక్కీలో పెట్టిన రూ.70వేల నగదును దొంగలు అపహరించారు. పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కుటాగుళ్లకు చెందిన ఇమాంఖాన్, సమీర్‌ఖాన్ శనివారం కరూర్ వైశ్యాబ్యాంకు నుంచి రూ.70వేలు నగదు డ్రా చేశారు. డబ్బును స్కూటర్ డిక్కీలో పెట్టుకుని బైపాస్ రోడ్డులోని మోర్ దుకాణం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఆపి మెకానిక్ వద్దకెళ్లారు. బ్యాంకు వద్ద నుంచి వారిని బైక్‌లో ఫాలో అయిన ఇద్దరు దుండగులు ఇదే అదునుగా భావించి, డిక్కీలోని నగదు అపహరించుకు వెళ్లారు. మెకానిక్ షాపు నుంచి బయటకు వచ్చిన ఇమాంఖాన్, సమీర్‌ఖాన్ డిక్కీలో చూసుకోగా.. నగదు కనిపించలేదు. చోరీ అయినట్లు గ్రహించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. డబ్బు కొట్టేసిన ఇద్దరికి సంబంధించిన సీసీ టీవీ ఫుటేజీని విడుదల చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

అమరాపురం, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలదపల్లికి చెందిన కెంచమ్మ(59) అప్పుల బాధ భరించలేక శనివారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కెంచమ్మ భర్త గతంలోనే మరణించాడు. ఈ నేపథ్యంలో ఇంటి నిర్మాణం, కుటుంబ అవసరాల నిమిత్తం రూ.4లక్షలు పైబడి అప్పు చేసింది. వాటిని తీర్చేందుకు కుమారుడు బెంగళూరుకు కూలి పనుల కోసం వెళ్లాడు. దీంతో కెంచమ్మ ఒంటరిగా ఉంటుండేది. ఈ నేపథ్యంలో అప్పుల వారి బాధలు అధికమవడంతో శనివారం ఉదయం గ్రామ సమీపంలోని చింత చెట్టుకు ఉరేసుకుని మరణించింది. అటుగా వెళ్లిన వారు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని మడకశిరకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

పనిచేసిన పాలకేంద్రాన్నే కొల్లగొట్టారు..!

- జనరేటర్, క్యాన్లు చోరీ
- ముగ్గురు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శేఖర్, చిత్రంలో ఎస్ఐ రాంబాబు

అనంతపురం క్రైం, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): తాము పనిచేసిన పాల కేంద్రం మూతపడడంతో రోడ్డునపడిన వారు అందులోని సామగ్రిపై కన్నేసి, కొల్లగొట్టారు. పోలీసులకు పట్టుబడి కటకటాల పాలయ్యారు. మూతపడిన పాలకేంద్రంలో చోరీ కేసులో ముగ్గురు నిందితులను అనంతపురం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10 లక్షల విలువైన జనరేటర్, 70 అల్యూమినియం పాల క్యాన్లు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో నిందితుల అరెస్టు వివరాలను అనంతపురం రూరల్ సీఐ శేఖర్.. ఎస్ఐ రాంబాబుతో కలిసి శనివారం వెల్లడించారు. నగరంలోని రంగస్వామి నగర్‌కు చెందిన షేక్షావలి (31) తపోవనంలో డీజే లైటింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. ఇతడికి అన్నమయ్య జిల్లా మొలకలచెరువు మండలం పాత మొలకల చెరువుకు చెందిన గోవిందు సింహాద్రి (24), హిందూపురం పట్టణంలోని డీఆర్ కాలనీకి చెందిన మనోహర్ (35) స్నేహితులు. గోవిందు సింహాద్రి, మనోహర్ గతంలో కొర్రపాడు, రాచానపల్లిలోని ప్రభుత్వ పాల కేంద్రాల్లో పనిచేశారు. అవి మూతపడడంతో వీరిరువురు రోడ్డున పడ్డారు. ఈ నేపథ్యంలో షేక్షావలికి తన డీజే షాపులోకి జనరేటర్ అవసరమైంది. ముగ్గురూ కలిసి ప్లాన్ వేశారు. గతనెల 14న రాచానపల్లిలోని పాలకేంద్రంలో ఉన్న 25 కేవీఏ సామర్థ్యంగల జనరేటర్, 70 పాలక్యాన్లను చోరీ చేసి, రెండు వాహనాల్లో తరలించారు. వాటిని విక్రయించేందుకు తరలిస్తుండగా.. పోలీసులకు సమాచారం రావడంతో దాడి చేసి, తపోవనం వద్ద ఉన్న పెట్రోల్ బంకు సమీపాన ముగ్గురిని అరెస్టు చేశారు. వారి నుంచి జనరేటర్, పాల క్యాన్లు, రెండు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.54	1,631.22
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	48,272	1,97,468
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	32,231	1,78,851
నీటి నిల్వ (టీఎంసీలు)	78.27	98.73

ఎరువుల సరఫరా సక్రమంగా చేపట్టాలి

● ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం మెరుగుపడాలి ● కేడీపీ సమావేశంలో పంచాయతీ పాలనాధికారి కేవీ త్రిలోక చంద్ర

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో జిల్లా రైతులకు వ్యవసాయినికి అవసరమైన ఎరువులు సరఫరా చేసేందుకు అధికారులు కృషి చేయాలని, ఆ దిశలో జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని విద్యా శాఖ కమిషనర్, జిల్లా పంచాయతీ పాలనాధికారి ఇన్‌చార్జ్ సెక్రటరీ డాక్టర్ కేవీ త్రిలోక చంద్ర సూచించారు. నగరంలోని జిల్లా పంచాయతీలోని నజీర్ సభాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన కర్ణాటక అభివృద్ధి కార్యక్రమాలు(20అంశాల) త్రైమాసిక కేడీపీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో జిల్లాలో 27025 మెట్రిక్ టన్నుల రసాయనిక ఎరువులు డిమాండ్ ఉండగా, ఇప్పటి వరకు 34,163 టన్నుల ఎరువులు నిలువ చేసినట్లు, ఇందులో 25,887 మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులకు పంపిణీ చేయగా, ఇంకా 8,286మెట్రిక్ టన్నుల ఎరువులు నిలువ ఉన్నట్లు సమావేశంలో వివరించారు. ఎరువుల సరఫరా, పంపిణీలో రైతులకు ఎలాంటి సమస్య తలెత్తకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సూచల మేరకు ఎక్కువగా రసాయనిక ఎరువులు ఉపయోగించడం ద్వారా ఎదురయ్యే దుష్పరిణామాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం త్రిలోక్ చంద్ర మాట్లాడుతూ, వ్యవసాయ, ఉద్యాన పథకాలు రైతుల దరి చేరాలని, జిల్లాలో పాడి పరిశ్రమ పెంచే దిశలో రైతులను ప్రోత్సహించాలని సూచించారు. జిల్లాలో సార్వజనిక ఆరోగ్య దృష్ట్యా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉత్తమ రీతిలో ప్రజలకు వైద్య సేవలు అందాలని సూచించారు. అనంతరం జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ బిఎంసిఆర్‌సిలో అంబులెన్స్ కొరత ఉందని, సార్వజనికులకు అసరమైన డాక్టర్లు అందుబాటులో ఉండరని త్రిలోక్ దృష్టికి తీసుకొచ్చారు. రక్తం, మందుల కొనుగోలుకు, వీల్‌చైర్ కోసం కూడా రోగుల నుండి డబ్బులు వసూలు చేస్తు'న్నట్లు, ప్రతినిత్యం కార్యాలయానికి వచ్చి ప్రజలు ఫిర్యా'దు చేస్తున్నట్లు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆసుపత్రుల్లో హోంగార్డ్స్, ఔట్



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ సెక్రటరీ కేవీ త్రిలోక్ చంద్ర

సోర్స్ వైద్యులు కూడా సార్వజనికుల సమస్యలకు సరిగా స్పందించడం లేదంటూ పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నట్లు బిమ్స్ డైరెక్టర్ నిర్వహణపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఇన్‌చార్జ్ కార్యదర్శి త్రిలోక్‌చంద్ర మాట్లాడుతూ జిల్లా స్థాయిలో అధికారులు తమ తమ శాఖల పరిధిలో ప్రభుత్వ పథకాల సమర్థవంతంగా అమలు జరిగేలా దృష్టి సారించాలని, జిల్లాలో అంగనవాడీ కేంద్రాలు, పాఠశాలపై విద్యుత్ లైన్లు వెళ్ళకుండా జెస్కాం అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో అపౌష్టికత నిర్మూలించేందుకు బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా అంగనవాడీ కేంద్రాల, పాఠశాలల్లో 18 సంవత్సరాల లోపు పిల్లలకు, పుట్టుకతో లోపాలు, వ్యాధులతో బాధపడుతున్న, పెరుగుదల లేకుండా ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న పిల్లలకు అవసరమైన చికిత్సలు అందించాలని జిల్లా ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. జిల్లాలో వసతి పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు ప్రమాణిక మైన విద్యను అందించేకు కృషి చేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ ముఖ్య కార్యదర్శి మహ్మద్ హ్యారీష్ సుమైర్, ఎస్పీ డాక్టర్ భోభారాణితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

959 రోజులకు చేరిన రైతుల నిరసన

కంప్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కుడితిని పట్టణంలో పరిశ్రమలకు పోగొట్టుకున్న రైతులు న్యాయపోరాటం కోసం చేపట్టిన నిరసన 959 రోజులకు చేరుతోంది. శనివారం ఈ సందర్భంగా బసవరాజు జంగిలిసాబ్ తిప్పేస్వామి మాట్లాడుతూ రైతులు ఎండనక వాననక పోరాడుతున్నా ఏ అధికారి కానీ, ఎమ్మెల్యే, ఎంపీ కానీ స్పందించలేదన్నారు. త్వరలోనే కుడితిని నుంచి సండూరు ఎమ్మెల్యే ఎంపీ పాదయాత్ర చేపట్టి వారి ఇంటి ముందే నిరసనలు చేపడతామన్నారు. రైతులకు అన్యాయం జరుగుతున్న తెలిసీ తెలియనట్లుగా నాయకులు వ్యవహరించడం సరికాదన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలపై నాయకులు స్పందించాలన్నారు. రైతులకు న్యాయం లభించే వరకు ఎన్ని రోజులైనా సరే ఎన్ని సంవత్సరాలైనా సరే ఈ నిరసనలు బంద్ చేయమని తెలిపారు.



నిరసన తెలుపుతున్న రైతులు

బళ్లారి రాఘవకు ఘన నివాళి

బళ్లారి సిటీ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నృత్య, తెలుగు, కన్నడ భాషా నాటక రంగాల్లో నిష్ణాతుడైన బళ్లారి రాఘవ 145వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు.



రాఘవకు నివాళి అర్పిస్తున్న కళాకారులు

గడగ చెన్నప్ప సర్కిల్లోని రాఘవ విగ్రహానికి కళాకారుల సంఘం, రాఘవ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాఘవ స్మారక సంఘం అధ్యక్షుడు కే.కోటేశ్వరావు, కార్యదర్శి ప్రకాశ రావు, రమణప్ప, కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లనగౌడ శంకర బండే, మృత్యుంజయ కప్పగల్లు పాల్గొన్నారు.

5నుంచి రవాణా ఉద్యోగుల సమ్మె

● సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ● నిరసనకు అన్ని సంఘాల మద్దతు: నాయకులు

బళ్లారి సిటీ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా సంస్థ ఉద్యోగులకు జీతాల సవరణ , బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని రాష్ట్ర రవాణా సంస్థలకు చెందిన కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ తెలిపింది. సమ్మెకారణంగా ఆరోజు బస్సుల నిర్వహణ నిలిచిపోతుందన్నారు. నగరంలోని పత్రికా భవనంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆసంస్థ నాయకుడు ఆదిమూర్తి మాట్లాడుతూ కేఎస్ఆర్టీసీ ఉద్యోగులు రాత్రింబవళ్లు కష్టపడి పనిచేస్తున్నాప్రభుత్వానికి కనీసం జాలి లేదన్నారు. ముఖ్యమంత్రి ఒక్కోసారి ఒక మాట చెబుతారన్నారు. 38నెలల బకాయిల సవరణ గురించి అడిగినప్పుడు రవాణామంత్రి రామలింగారెడ్డి గత ప్రభుత్వం వైపు వేలు ఎత్తి చూపిస్తున్నారు. బెంగళూరులోని ఫ్రీడం పార్కులో వారు ప్రభుత్వం ఎస్మా అమలు చేస్తామన్నారు. ప్రభుత్వ బస్సులు ఆపుతామంటే ప్రైవేట్ బస్సులను నడుపుతామని రవాణా మంత్రి గొప్పలు చెప్పడం తగదన్నారు.

ముఖ్యమంత్రి సిద్దరామయ్య సాధన సమావేశంలో ఐదుహామీలు ఇచ్చారని బెబుతున్నారు. కానీ రవాణా ఉద్యోగుల 38నెలల సవరించిన జీత బకాయిలను ఎందుకు చెల్లించడంలేదని ప్రశ్నించారు. శక్తి యోజన రవాణా ఉద్యోగుల వల్లే విజయవంతమైంది ఈప్రాజెక్టు బకాయి మొత్తం రూ.3500 కోట్లు చెల్లిస్తే తమ డిమాండ్లు నెరవేరుతాయన్నారు. ప్రభుత్వం దీనిపై స్పందించడంలేదని వారు అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సమ్మెకు దిగుతున్నామన్నారు. ఈసమ్మెలో కేఎస్ఆర్‌టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్,ఆల్ కర్ణాటక స్టేట్ రోడ్డుట్రాన్స్‌పోర్ట్ ఎంప్లాయీస్ మహామండలి, కర్ణాటక స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్, కార్పోరేషన్ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అధికారులు, ఉద్యోగుల సంక్షేమ అభివృద్ధి సంఘం, కర్ణాటక స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పోరేషన్ ఎంప్లాయీస్ అసోసియేషన్ వంటి ఇతర సంస్థలు కూడా సమ్మెలో పాల్గొంటాయన్నారు. విలేకరుల సమావేశంలో బసవరాజ్,శివప్ప, హనుమంతప్ప, గాదిలింగప్ప, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



సమ్మె పోస్టర్లు విడుదల చేస్తున్న జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు

చెల్లిని వేధిస్తున్నాడని బావను కడతేర్చాడు

● ఎత్తిన బూదేహాళ్‌లో దారుణ హత్య
● గ్రామంలో పర్యటించిన ఎస్పీ



మహేష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

బళ్లారి రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తన చెల్లిని వేధిస్తున్నాడని సొంత బావనే దారుణంగా హత్య చేసిన ఘటన బళ్లారి తాలుకాలోని ఎత్తిన బూదేహాళ్ గ్రామంలో జరిగింది. శుక్రవారం మహేష్ (28) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మహేష్ అతని భార్య సంగీతతో నిత్యం గొడవపడేవాడు. గొడవను భరించలేక సంగీత సోదరుడు బసవరాజు మహేష్ తాగుడుకు బానిసై వేధిస్తున్నాడని అన్న దగ్గర వాపోయింది. ఈ నేపథ్యంలో బసవరాజు శుక్రవారం రాత్రి మహేష్‌పై వేటకొడవలితో అతి దారుణంగా దాడి చేయడంతో మహేష్ మృతిచెందాడు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని మహేష్ మృతదేహాన్ని పోస్టుమార్టమ్ బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మహేష్‌కి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బూదేహాళ్ గ్రామాన్ని సందర్శించిన ఎస్పీ

బూదేహాళ్‌లో శుక్రవారం రాత్రి హత్య జరిగిన నేపథ్యంలో శనివారం ఎస్పీ శోభారాణి గ్రామాన్ని సందర్శించారు. బసవరాజును అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు సోదాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎస్పీ వెంట డీఎస్పీ సంతోష్ చౌహాన్, సీఐ సతీష్ సిబ్బంది ఉన్నారు.

చెల్లిని చంపిన కేసులో సోదరుడికి జీవిత ఖైదు

బళ్లారి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం సొంత చెల్లిని హత్య చేసిన కేసులో హంతకుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ బళ్లారి కేజేకే జిల్లా 2వ సెషన్స్ కోర్టు న్యాయాధికారి శనివారం తీర్పు ఇచ్చారు. ఈ కేసుకు సంబందించి వివరాలు ఇలా ఉన్నాయి. బళ్లారి నగరంలోని సత్యనారాయణపేట(ఎస్ఎన్‌పేట)లో నివాసం ఉండే వేణుగోపాల్ అతని సొంత అక్క సునందను 2017లో ఇంట్లోనే చెల్లిపై కత్తితో దాడి చేసి హత్యచేశాడు. తల్లిదండ్రుల ఆస్తిలో వాటా కావాలని అడిగినందుకు ఆమెను హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొన్నారు. 2017లో గాంధీనగర్ పోలీ స్టేషన్‌లో కేసునమోదు అయింది. ఈ కేసుకు సంబందించి 16 మంది సాక్షులను విచారించారు. ఈ కేసుకు పీపీ లక్ష్మీదేవి మృతురాలు తరుపున వాదించారు. హతుడు వేణుగోపాల్‌కు జీవిత ఖైదీ తోపాటు రూ.25 వేలు జరిమానా, జరిమానా చెల్లిచలేని స్థితిలో ఉంటే మరో ఏడాది జీవిత కాలం పెంచుతూ తీర్పును ఇచ్చారు. అలాగే మృతురాలు కుమారుడుకు రూ.50 వేల పరిహారం చెల్లించాలని కోర్టు తీర్పు ఇచ్చింది.



మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ ఏడీ రాజేశ్వరి

చదువుతోపాటు కళల్లో రాణించాలి

● సాంఘిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేశ్వరి

బళ్లారి సిటీ,ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జానపద సంగీత కార్యక్రమాలు కళాకారులకు వేదికను అందిస్తాయని, విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేశ్వరీ అన్నారు. కన్నడ సంస్కృతిక శాఖ,సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్తాధ్వర్యంలో నగరంలోని కోటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ బాలికల హాస్టల్లో శనివారం నిర్వహించిన షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల కోసం 'జానపద సంగీతం' అభ్యాస శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి వారు మాట్లాడారు. మన జీవనాడి అయిన స్వదేశీ కళ, మన సంస్కృతిని ప్రతిబింబించే అసలైన జానపద సంగీతం ఇటీవల నిర్లక్ష్యానికి గురి కావడం శోచనీయమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు కళల్లో కూడా రాణించాలన్నారు. కన్నడ సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు మాట్లాడుతూ.. కనుమరుగవుతున్న కళలను పునరుద్ధరించడానికి ఈ శిక్షణను ఏర్పాటు చేశామన్నారు. ఈ శిక్షణ 6నెలల పాటు కొనసాగుతుందని, వారానికి మూడు రోజులు 2గంటల పాటు శిక్షణ ఇవ్వబడుతుందని, ఆసక్తి ఉన్న విద్యార్థులు పాల్గొని తమ కళలను ప్రదర్శించాలన్నారు. జానపద గాయకుడు చిగురు కళా బృందం శిక్షకుడు హులుగప్ప మాట్లాడుతూ విద్యలో సంగీతాన్ని బోధించినట్లే, జానపద కళలను ప్రాథమిక దశ నుండే ఒక అంశంగా బోధించాలన్నారు. మసకబారుతున్న జానపద కళను తదుపరి తరానికి పరిచయం చేస్తామన్నారు. జానపద సంగీతం ద్వారా కళను శిఖరాగ్రానికి తీసుకెళ్లడంలో విద్యావంతుల పాత్ర అపారమన్నారు. ఈసందర్భంగా హాస్టల్ సూపర్‌వైజర్ ఉషాకుమారి, హాస్టల్ కస్టోడియం స్వప్నతోపాటు డిపార్ట్ మెంట్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శరణుల వచనాలు ప్రభావితమైనవి

● రిటైర్డ్ ఉపాధ్యాయురాలు జయశ్రీ



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జయశ్రీ

బళ్లారి సిటీ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): శరణుల ఆలోచనలన్నీ భావజాల నిధి అని, నిరక్ష్యరాసులను సైతం ప్రభావితం చేసిన గొప్ప భావాలని రిటైర్డ్ టీచర్ ఎం.జయశ్రీ అన్నారు. శనివారం బళ్లారి యూనిట్ శరణ్ సాహిత్య పరిషత్ కప్పగల్లులోని శారద ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో నిర్వహించిన 317వ మహామనే దత్తి సంగనకల్లు పెద్ద శరణప్ప, హంపమ్మ దత్తికార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మానవ విలువలను ప్రకాశవంతం చేసే పురుష రత్నాలు, పదాలు, చర్యలు, ఆచారాలు ఆలోచనలు ఒక వ్యక్తిలో నైతిక, మతపరమైన, ఆధ్యాత్మిక అభివృద్ధిని తీసుకురావడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయన్నారు. విద్యాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు పరమేశ్వరప్ప మాట్లాడుతూ.. జ్ఞానం, తెలివితేటలు మాత్రమే ఒక వ్యక్తి తన లక్ష్యాలను సాధించడంలో సహాయపడలేవని, హేతుబద్ధత మాత్రమే నడిపించగలదన్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్, విద్యార్థులు, సిద్ధలింగప్ప పాల్గొన్నారు.

అడవి పందుల దాడిలో మొక్కజొన్న పంట ధ్వంసం



కణివిహళ్లి వద్ద ధ్వంసమైన పంటను చూపుతున్న రైతులు

కంప్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని జాజికల్ కొండ అటవీ ప్రాంతానికి అనుకుని ఉన్న బావిహళ్లి, కొంగనహోసూర్, కణివిహళ్లి గ్రామాల భూముల్లోకి గత కొన్ని రోజులుగా అడవి పందులు ప్రవేశించి పంటలను నాశనం చేస్తున్నాయి. అటవీశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. బావిహళ్లి గ్రామానికి చెందిన పూజారి బసప్ప, నెల్కుద్రి బసవరాజు అనే రైతుల భూముల్లోకి శనివారం తెల్లవారుజామున అడవి పందులు ప్రవేశించి భారీ మొత్తంలో మొక్కజొన్న పంటను ధ్వంసం చేశారు. రైతులు ఎన్నో కష్టాలు పంటలు వేసుకుంటే ఇలా అడవుల్లో నుండి అడవి పందులు పంటలపై దాడి చేసి పూర్తిగా నష్టం చేస్తున్నాయని రైతన్నలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ప్రతియేటా అడవి పందుల వల్ల పంటలు పూర్తిగా నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, రైతులు జరిగిన నష్టపరిహారాన్ని దృష్టిలో వుంచుకుని కొండ ప్రాంతాల్లో విద్యుత్ లైట్లు కంచె ఏర్పాటు చేసి రైతులకు వాటిల్లకుండా చూడాలని కోరారు.

మైనార్టీలు ఆర్థిక పురోగతి సాధించాలి

● విజయనగరం కలెక్టర్ ఎంఎస్ దివాకర్



మాట్లాడుతున్న కలెక్టర్ ఎంఎస్ దివాకర్

హోస్పేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి ప్రధానమంత్రి కొత్త 15పాయింట్ల కార్యక్రమం పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ ఎంఎస్ దివాకర్ మాట్లాడుతూ మైనార్టీల ఆర్థిక, భౌతికపురోగతిని సాధించడానికి ప్రభుత్వం వివిధ శాఖల్లో అందిస్తున్న పథకాలను తగినంతగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. మైనార్టీలకు విద్యా అవకాశాలను పెంచడానికి, జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి, సాంకేతిక శిక్షణ ద్వారా నైపుణ్య కార్యక్రమాలను అందించడం, ఆర్థిక కార్యకలాపాలను బలోపేతం చేయడానికి రుణ సౌకర్యాలను అందించడం, గృహనిర్మాణ పథకాలను అందించడంబ ఇలాంటి అనేక కార్యక్రమాలపై ఆయన ఆదేశాలు ఇచ్చారు. 15పాయింట్ల కార్యక్రమంలో పాల్గొన్న మహిళా, శిశు అభివృద్ధి శాఖ యొక్క అన్ని సౌకర్యాలను అందించాలన్నారు.యూనిఫాం, ఉచిత పాఠ్యపుస్తకాలు, స్కాలర్‌షిప్‌లు, ఇతర సౌకర్యాలను విద్యాశాఖ అందించాలి, వ్యవసాయ శాఖ నుంచి సూక్ష్మ నీటి పారుదల, వ్యవసాయ యాంత్రీకరణ,విత్తనాల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు.

హోసూరు జోన్





కుడితిని ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల పూజలు కంప్లిలో మనుమంతుడు

ఆలయాల్లో శ్రావణమాస పూజలు

కంప్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం రెండవ శనివారం సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆలయాల్లో భక్తాదులు కిటకిటలాడారు. శ్రావణమాసంలో ప్రతిరోజు ప్రత్యేక పూజలు పురస్కరించుకుని ప్రతి ఆలయంలో పూజలు జరుపుతూనే వుంటారు. కంప్లి, ఎమ్మిగనూరు, కురుగోడు, కుడితిని గ్రామాల్లో ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. కుడితినిలో ఆంజనేయ స్వామి ఆలయంలో స్థాయి సమితి అధ్యక్షులు రాజశేఖర్ ఉపాధ్యక్షులు, కనికేరి పంపాపతి కౌన్సిలర్ వెంకటరమణ బాబు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరోపణలు రుజువైతే కఠిన చర్యలు

● రాయచూరు జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య



రాయచూరు, ఆగస్టు2: జిల్లాలోని లింగసుగూరు పోలీస్ స్టేషన్‌లో యువకుడొకరిని విచారణ పేరుతో పిలిచి బట్టలూడదీశారన్న ఆరోపణలపై విచారణకు ఆదేశించినట్లు జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడిన ఎస్పీ పోలీసుల తప్పిదం ఉన్నట్లు రుజువైతే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శనివారం తన కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడిన ఎస్పీ, బాధిత యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లింగసుగూరు పోలీస్ స్టేషన్ పై విచారణ జరిపించేందుకు ఇప్పటికే ఆదేశించామన్నారు. లింగసుగూరు పట్టణానికి చెందిన అమరేశ్‌ను విచారణ పేరుతో అక్కడే స్టేషన్‌కు పిలిచిన పోలీసులు ఆయన బట్టలు ఊడదీయంతో పాటు డబ్బును కాజేసించినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడన్నారు. ఫిర్యాదులో బాధితుడు ఎలాంటి వీడియో చిత్రాలు గాని ఇతరత్ర ఆధారాలు చూపలేదన్నారు. డబ్బు వసూలుకు సంబంధించి తాను ఫోన్ పే ద్వారా పోలీసులకు పంపిన స్క్రీన్ షాట్‌ను అందజేసినట్లు ఎస్పీ వివరించారు. వాటి పై అధ్యయనం చేసి నిజాలను నిర్ధారిస్తామన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

రొళ్ల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీరిగేపల్లి గ్రామంలో వెలసిన అమ్మాజీ దేవాలయాన్ని శనివారం కర్ణాటక రాష్ట్రం పావగడ మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, రాయుడు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వైద్య శిబిరంలో కలెక్టర్ దివాకర్, ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ తదితరులు

జిల్లావ్యాప్తంగా వైద్య శిబిరాలు: కలెక్టర్

బెంగళూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ చేపట్టిన 'నలం కక్కుమ్ స్టాలిన్' కార్యక్రమంలో భాగంగా శనివారం కృష్ణగిరి జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు జరిగాయి. ఇందులోభాగంగా హోసూరు మునిసిపాలిటీ కామరాజ్ కాలని మిడిల్‌స్కూల్, పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాలలో వైద్య శిబిరాలు నిర్వహించారు. కృష్ణగిరి కలెక్టర్ దినేశ్‌కుమార్, హోసూరు ఎమ్మెల్యే ప్రకాశ్, కార్పొరేషన్ మేయర్ సత్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తమిళనాడు ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. శిబిరాల ద్వారా జనరల్ మెడిసిన్‌తోపాటు జనరల్ సర్జరీ మెడికల్ కన్సల్టేషన్, ఆర్థోపెడిక్స్, ప్రసూతి, గైనకాలజీ, పీడియాట్రిక్స్, కార్డియాలజీ, న్యూరాలజీ, డెర్మటాలజీ, డెంటల్, ఆప్తాల్మాలజీ, ఇఎన్‌టీ, సైకియాట్రి, ఎక్స్‌రే, ఈసీజీ, అల్ట్రాసౌండ్ తదితర సేవలు శిబిరంలో అందిస్తున్నారని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ చెన్నైలోని శాంతోమ్ సెయింట్‌పీటర్స్ ఆంగ్లో ఇండియన్ స్కూల్‌లో వైద్య శిబిరాన్ని సీఎం స్టాలిన్ ప్రారంభించారన్నారు. శిబిరంలో ముఖ్యమంత్రి సమగ్ర వైద్యబీమా పథకం, దివ్యాంగుల గుర్తింపు కార్డు, కార్మికసంక్షేశాఖ కింద సంక్షేమబోర్డులో నమోదు చేసుకున్న సభ్యులకు పరీక్షలు చేస్తున్నారు. సుమారు 2వేలమంది పరీక్షలు చేయించుకున్నారు. కాగా జిల్లాలో మొత్తం 33వైద్య శిబిరాలు నిర్వహించారు. హోసూరు కార్పొరేషన్ కమిషనర్ మహ్మద్ షబీర్ ఆలం, డిప్యూటి మేయర్ ఆనందయ్య, కృష్ణగిరి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పూవతి, జిల్లా ఆరోగ్య అధికారి రమేశ్‌కుమార్, హోసూరు కార్పొరేషన్ ఆరోగ్య అధికారి సుజాత, దివ్యాంగుల సంక్షేమ అధికారి మురుగేశన్, తహసీల్దార్ గుణశివ, ఆరోగ్యకమిటీ చైర్మన్ మాదేశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.

నాగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

హోసూరు, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): సమీపంలోని కామరాజనగర్‌లోని నాగమ్మ దేవాలయం 18వ వార్షికోత్సవంలో భాగంగా నాగమ్మ, ముత్తుమారియమ్మల విశేష పూజలు నిర్వహించారు. శనివారం కళశపూజ, వాస్తు హోమం, గణపతి హోమం, పూర్ణాహుతి, అభిషేకం చేశారు. నవగ్రహశాంతి హోమం, దుర్గాహోమం, అనంతరం కరగను ఊరేగించారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆది, సోమవారాలలో ప్రత్యేక పూజలు కొనసాగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.